www.vaarthavedhikasurya.com

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

తెలంగాణ | పేజీలు: 08 | వెల: 5 | సంపుటి:01 | సంచిక: 107 | గురువారం | 13, ఫిబ్రవరి 2025 | ॥ ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి ॥



## మాఘపూర్ణిమతో కుంభమేళాకు పోటెత్తిన భక్తులు

- కోటిన్నరకు పైగా భక్తులు వచ్చినట్లు వెల్లడి

ప్రయాగ్‌రాజ్,ఫిబ్రవరి12(వార్త వేదిక సూర్య): ప్రయాగ్‌రాజ్‌లో ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా కన్నుల పండువగా కొనసాగుతోంది. దేశ, విదేశాల నుంచి ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. కుంభమేళాలో మరో పుణ్య ఘట్టమైన మిగతా 2లో..

## స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే

- ఎంపీ ఆర్. కృష్ణయ్య డిమాండ్



న్యూఢిల్లీ,ఫిబ్రవరి12(వార్త వేదిక సూర్య): స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రకులాలలో పేదలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు సీలింగ్‌ను సుప్రీంకోర్టు ఎత్తివేసిందని, ఇప్పుడు ఏ సీలింగ్ లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రిజర్వేషన్లు పెంచేందుకు అసెంబ్లీలో చట్టం చేయాలని, మిగతా 2లో..

## హోంగార్డులకు జీతాలు చెల్లించకపోవడం సిగ్గుచేటు

- హోం గార్డులకు జీతాలు చెల్లించక పోవడం పట్ల రాష్ట్ర ప్రభుత్వం పై మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్



హైదరాబాద్,ఫిబ్రవరి12(వార్త వేదిక సూర్య): రాష్ట్ర వ్యాప్తంగా 16వేలకు పైగా ఉన్న హోం గార్డులకు 12 రోజులు గడుస్తున్నా జీతాలు చెల్లించకపోవడం సిగ్గుచేటు. చిన్న జీతాలపైనే ఆధారపడి జీవిస్తున్న హోంగార్డులు.. చేతిలో చిల్లిగవ్వలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు, రోజువారీ ఖర్చుల కోసం అప్పులు చెయ్యాల్సిన మిగతా 2లో..

## బీసీలందరికీ రేవంత్ క్షమాపణలు చెప్పాలి

- బీసీ కులగణన తప్పులతడక అని ఒప్పుకున్నందుకు సంతోషం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్,ఫిబ్రవరి12(వార్త వేదిక సూర్య): కులగణన సర్వే తప్పుల తడక అని రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఒప్పుకోవడాన్ని స్వాగతిస్తున్నాం. అయితే బీసీల జనాభాను తగ్గించి వెనకబడిన వర్గాల ప్రజలను తీవ్ర మానసిక వేదనకు గురి చేసినందుకు ముఖ్యమంత్రి రాష్ట్రంలోని మిగతా 2లో..




# స్థానిక ఎన్నికలు మరింత ఆలస్యం

- న్యాయపరమైన చిక్కులు రాకుండా చర్యలు
- రిజర్వేషన్లపై ప్రభుత్వం మల్లగుల్లాలు
- అధికారులతో సిఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- మిగిలిన వారి కోసం మరోమారు కులగణన


హైదరాబాద్,ఫిబ్రవరి12(వార్త వేదిక సూర్య): తెలంగాణలో స్థానిక ఎన్నికల నిర్వహణపై స్పష్టత కానరావడం లేదు. ఓ వైపు సమీక్షలు చేస్తుంటే..మరోవైపు మళ్లీ కులగణకు అవకాశం ఇవ్వండతో అనుమానాలు తలెత్తుతున్నాయి. దీంతో ఆసల్యం తప్పదన్న భావన కూడా ఉంది. ఈనెల 15వ తేదీలోపు స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందని భావించారు. కానీ, స్థానిక ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మరోసారి కులగణన సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సర్వేలో పాల్గొనని వారికి ఈనెల 16 నుంచి 28 వరకు అవకాశం కల్పించింది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని స్పష్టం చేసింది. దీంతో రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందాకే ఎన్నికలు నిర్వహించే అవకాశముంది. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సామాజిక కులగణన సర్వేలో 1,03,889 మంది ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు. 96.9శాతం అంటే3.50 కోట్ల మంది సర్వేలో పాల్గొని వివరాలు అందించారు. 3.1శాతం అంటే 16లక్షల మంది వివిధ కారణాల వల్ల వివరాలు అందించలేదు. అయితే ఈ లెక్కల ఆధారంగానే పంచాయతీ ఎన్నికలకు వేగంగా అడుగులు పడుతున్నాయి. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలను వెంట వెంటనే నిర్వహించనుందని సమాచారం. ఎన్నికలకు సన్నద్ధతపై ఇటు ప్రభుత్వం, అటు ఎన్నికల కమిషన్ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తోంది. ఓటర్ల జాబితాను సైతం ఈసీ ఇటీవలే ప్రకటించింది. ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎలక్షన్స్ పెట్టే మిగతా 2లో..



## సేవాలాల్ జయంతి ఉత్సవాలకు సిఎంకు ఆహ్వానం

హైదరాబాద్,ఫిబ్రవరి12(వార్త వేదిక సూర్య): ఈ నెల 15 న మహావీర్ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి నిర్వహించనున్నారు. ఏటా ప్రభుత్వం అధికారికంగా దీనిని నిర్వహిస్తోంది. ఉత్సవాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంత్రి సీతక్క, గిరిజన సంఘాల ముఖ్య నాయకులు కలిశారు. ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా ఆహ్వానం అందించారు. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.

## దశాబ్దాల ఓబీసీల కల నిజం చేస్తాం..



- డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సమగ్ర ఇంటింటి సర్వేపై జరిగిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్,ఫిబ్రవరి12(వార్త వేదిక సూర్య): ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. దశాబ్దాల ఓ బీసీల కల నిజం చేస్తాం.అసెంబ్లీలో ఓబీసీ రిజర్వేషన్ బిల్లు పాస్ చేయించి, పార్లమెంట్లో పెట్టిస్తాము. మార్చి మొదటి వారంలో అసెంబ్లీలో ఓబీసీల రిజర్వేషన్ బిల్లు ఆమోదింప చేస్తాం.

కలసి వచ్చే రాజకీయ పార్టీలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీకి ప్రతినిధి బృందం వెళుతుంది. ప్రధానితోపాటు అన్ని పార్టీల నేతలను కలుస్తాం, విజ్ఞప్తి చేస్తాం.పార్లమెంట్లో ఓబీసీల రిజర్వేషన్ బిల్లు పాస్ చేయించేందుకు దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలను కూడగడతాం .. రాజకీయ శక్తులను ఏకం చేస్తాం

జనాభా వివరాల నమోదుకు మరోసారి అవకాశం.. ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు. మూడు పద్ధతుల్లో ఇప్పటివరకు నమోదు చేసుకొని వారికి అవకాశం కల్పిస్తున్నాం. రాష్ట్రంలో కులగణన మిగతా 2లో..



## నోటాను కల్పిత అభ్యర్థిగా ప్రతిపాదించిన ఇసి

- తీవ్రంగా వ్యతిరేకించిన రాజకీయ పార్టీలు
- ఏకగ్రీవాల పేరుతో దందాలను అరికట్టాలన్న ఇసి
- రాజకీయ పార్టీలతో భేటీఓ కుదరని ఏకాభిప్రాయం

హైదరాబాద్,ఫిబ్రవరి12(వార్త వేదిక సూర్య): స్థానిక సంస్థల ఎన్నికల్లో నోటాను కల్పిత అభ్యర్థిగా పెట్టాలా వద్ద అనే అంశం రాజకీయ పార్టీల్లో మిశ్రమ స్పందన వ్యక్తం అయింది. కాంగ్రెస్ పార్టీ ఈ పద్ధతిని వ్యతిరేకించగా బిఆర్ఎస్ పార్టీ స్వాగతించింది. బీజేపీ మాత్రం రాష్ట్ర ఎన్నికల సంఘంకి ఆ అధికారం లేదని.. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పింది. సిపిఎం నోటా ఉండాలని.. కానీ అభ్యర్థిగా గుర్తించొద్దని స్పష్టం చేసింది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో రాష్ట్ర ఎన్నికల సంఘం భేటీ అయింది. ట్రయల్ ప్రాతిపదికన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నోటాను కూడా ఒక కల్పిత అభ్యర్థిగా పెట్టాల మిగతా 2లో..

## కుల గణన ఓ బోగస్ సర్వే

- తెలంగాణలో 4.3 కోట్లకుపైగా జనాభా ఉంది
- 3.95 కోట్ల మందికి ఆధార్ కార్డులున్నయ్
- 3.35 కోట్ల మంది ఓటర్లున్నారు
- 1 నుండి 12 చదువుకుంటున్న విద్యార్థుల సంఖయ 60 లక్షలపైనే...
- స్కూలుకు వెళ్లని వారు, చిన్నారులు కలిపితే మరో 30 లక్షలపైనే....
- కుల గణనలో లేని 60 లక్షల మందికిపైగా ప్రజలు ఏమైనట్లు?
- స్థానిక ఎన్నికలను తప్పించుకునేందుకే డ్రామాలాడుతున్నారు
- ఇకనైనా చేసిన తప్పిదాలను సరిదిద్దుకోవాలి
- మళ్లీ ఇంటింటికీ రీసర్వే చేపట్టాల్సిందే
- గ్రామ సభల ఆమోదం పొందాల్సిందే
- బీసీల్లో ముస్లింలను చేరిస్తే ఒప్పుకునే ప్రసక్తే లేదు
- బీసీ సామాజిక ఓటర్ల సంఖ్యను తగ్గించి చూపడం వెనుక కుట్ర
- కులగణన పట్ల కాంగ్రెస్ నేతల్లోనే విబేధాలున్నాయి
- తక్షణమే చేసిన తప్పులను సరిదిద్దుకోవాలి



హైదరాబాద్,ఫిబ్రవరి12(వార్త వేదిక సూర్య): కులగణన సర్వేలో 3.1 శాతం మంది పాల్గొనలేదని, వారి కోసం మళ్లీ రీ సర్వే చేస్తామని రాష్ట్ర ప్రభుత్వంప్రకటించడం దుర్మార్గం. ఎందుకంటే కులగణన సర్వే అంతా తప్పుల తడక. ఎన్నికల సంఘం లెక్కల ప్రకారం... తెలంగాణలో 3 కోట్ల 35 లక్షలకుపైగా ఓటర్లున్నారు. అట్లాగే ఓటు హక్కు లేని వారి విషయానికొస్తే.... ఒకటో తరగతి నుండి ఇంటర్మీడియట్ చదివే విద్యార్థుల సంఖ్య 60 లక్షలుగా నమోదైంది. వీరుగాక పాఠశాలకు వెళ్లని వారు, 0 నుండి 5 ఏళ్ల లోపు పిల్లలు మరో 30 లక్షలకుపైగా ఉంది. మిగతా 2లో..





## బీర్ల ధరలు పెంచడం దేనికి సంకేతం?

- ఏపీ,తెలంగాణ ఒక్కటై బీర్ల ధరలు పెంచారా?
- ఏపీ,తెలంగాణ రాష్ట్రాలను మద్యం మాఫియా నడిపిస్తోంది
- కొద్దిరోజుల్లో బ్రాందీ,విస్కీ ధరలు పెరుగుతాయి
- ఏపీ ప్రభుత్వం చెప్తే ధరలు పెంచారా ?
- మాజీ మంత్రి వి .శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్,ఫిబ్రవరి12(వార్త వేదిక సూర్య): బీరుకు 30 నుండి 40 రూపాయలు ధర పెంచారు. బి ఆర్ ఎస్ హయాంలో నామమాత్రపు ధర పెంచితే గగ్గోలు పెట్టారు. బీర్ల ధరలు పెంచడం దేనికి సంకేతం? నాణ్యతలేని బీర్లు తీసుకువస్తున్నారు. బెల్టు షాపులు బంద్ చేస్తామని ఎన్నికల సందర్భంగా రేవంత్ రెడ్డి చెప్పారు. ఏపీ,తెలంగాణలో ఒకే సారి ధరలు పెంచారు ఏపీ,తెలంగాణ రాష్ట్రాలను మద్యం మాఫియా నడిపిస్తోంది ఏపీ,తెలంగాణ ప్రభుత్వాలు ఒప్పందంతో నడుస్తున్నాయి. రాహుల్ గాంధీ ప్రకటించిన డిక్లరేషన్లు అమలు అవుతు న్నాయో తెలుసుకోవాలి. హోంగార్డులకు ఇప్పటి వరకు జీతాలు లేవు. మిగతా 2లో..

## దక్షిణ భారతదేశంలో ఆధ్యాత్మిక యాత్రకు పవన్ శ్రీకారం



- మొదటిగా కేరళలోని చొట్టనిక్కరలోని శ్రీ అగస్త్య మహర్షి ఆలయం సందర్శన
- ఆ ఆశ్రమంలో ఆయుర్వేద చికిత్స గురించి అడిగి తెలుసుకున్న పవన్

చొట్టనిక్కర: దక్షిణ భారతదేశంలో ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం చుట్టిన ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బుధవారం ఉదయం కేరళ రాష్ట్రంలోని కొచ్చి విమానాశ్రయానికి చేరు కున్నారు. అక్కడి నుంచి నేరుగా చొట్టనిక్కరలోని శ్రీ అగస్త్య మహర్షి ఆలయానికి చేరుకున్నారు. పవన్‌తోపాటు ఆయన తనయుడు మిగతా 2లో..

## ఫ్రాన్స్‌లో యుద్ధవీరులకు మోడీ నివాళి

- మార్సెయిల్‌లో భారత కాన్సులేట్ కార్యాలయం ప్రారంభం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి12(వార్త వేదిక సూర్య): ఫ్రాన్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోజుల అధికారిక పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారంనాడు పలు కార్యక్రమాల్లో మోదీ పాల్గొన్నారు. దక్షిణ మార్సెయిల్‌లోని మజార్గ్యూస్ యుద్ధ శ్మశానవాటికను సందర్శించి మొదటి, రెండవ ప్రపంచ యుద్ధంలో అమరులైన భారత జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. ప్రధాని వెంట ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ కూడా మిగతా 2లో..





## నిలదీస్తారనే రాహుల్ వరంగల్ పర్యటన రద్దు చేసుకున్నారు

- తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మార్చి 8న మహిళా శంఖారావం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్,ఫిబ్రవరి12(వార్త వేదిక సూర్య): వరంగల్ వచ్చే ధైర్యం లేక రాహుల్ గాంధీ పారి పోయారు. హామీలపై ప్రజలు నిలదీస్తారనే రాహుల్ గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారు. అదే వరంగల్ లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ అమలే కాలేదు.వరంగల్ డిక్లరేషన్ పై రైతులు ప్రశ్నిస్తారని రాహుల్ గాంధీ భయపడ్డారు. ఇచ్చిన మాట తప్పితే ప్రజలు ఊరు కోబోరు. మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు ఎక్కడా తిరగలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఇక్కడి కాంగ్రెస్ నాయకులను ప్రజలు నమ్మడం లేదని ఎన్నికలప్పుడు ఢిల్లీ నుంచి నాయకులను తీసుకొచ్చారు. సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ, రాహుల్ గాంధీ వచ్చి చిలుక పలుకులు పలికారు. రేవంత్ రెడ్డి ముఖం కాదు... సోనియా, ప్రియాంకా, రాహుల్ గాంధీల ముఖం చూసి మహిళలు కొంత వరకు ఓట్లు వేశారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు అయినా మహిళలకు 2500 ఇవ్వడం లేదు రేవంత్ రెడ్డి మహిళలకు రూ 35 వేల చొప్పున బాకీ పడ్డారు.. రూ. 35 వేలను ప్రతీ మహిళా బ్యాంకు ఖాతాలో జమ చేయాలి. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మార్చి 8న మహిళా శంఖారావం.రాష్ట్రంలో మహిళలకు భద్రత మిగతా 2లో..

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

## బీసీలందరికీ రేవంత్ క్షమాపణలు చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

బీసీలందరికీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలి. అసమగ్రంగా చేసిన సర్వేపై బీఆర్ఎస్ తోపాటు.. బీసీ సంఘాలు ముక్తకంఠంతో అభ్యంతరం వ్యక్తంచేసినా వినకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అసంపూర్తి లెక్కల ఆధారంగా అసెంబ్లీలో తీర్మానం చేయడం కూడా ముమ్మాటికీ తప్పేనని అంగీకరించాలి.

రెండోసారి సర్వేనైనా సమగ్రంగా చేయడంతోపాటు.. బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి.కేవలం తూతూమంత్రంగా తీర్మానం చేసి.. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రం పరిధిలోకి నెట్టి చేతులు దులుపుకుందా మంటే మాత్రం బీఆర్ఎస్ తోపాటు.. బీసీ సంఘాలు ఎట్టిపరిస్థితుల్లో అంగీకరించే ప్రసక్తే లేదు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన మాటను సంపూర్ణంగా నిలబెట్టు కునే వరకూ కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలోని బీసీలెవరూ నమ్మే పరిస్థితిలో లేరనే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుపెట్టుకుంటే మంచిది.

## నిలదీస్తారనే రాహుల్ వరంగల్ పర్యటన రద్దు చేసుకున్నారు

(మొదటి పేజీ తరువాయి)

లేని పరిస్థితి.రేవంత్ రెడ్డి పాలనలో క్రైమ్ రేటు 20 శాతం పెరిగింది. ఆడపిల్ల కాలేజీకి వెళ్తే ఇంటికొచ్చే వరకు ఎదురుచూసే పరిస్థితి ఏర్పడింది. శివారు ప్రాంతాల్లోని ఇళ్లలో దొంగలు చెలరేగుతున్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఒక్క మతకల్లోలం జరగలేదు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాకా ఎక్కడో ఒక చోట తరుచూ మతకల్లోలాలు జరుగు తున్నాయి. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీటీవీల్లో 70 శాతం పనిచేయడం లేదు.

భద్రత కోసం కూడా మహిళలు పోరాటం చేయాల్సిరావడం బాధాకరం.18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీ ఇస్తామని రేవంత్ రెడ్డి మోసం చేశారు. కేసీఆర్ పై అక్కసుతో కేసీఆర్ కిట్ లను నిలిపివేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మానవత్వం లేకుండా ప్రవర్తిస్తున్న రేవంత్ రెడ్డి. ప్రభుత్వ ఆస్పత్రు లకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ ఆస్పత్రులపై శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేస్తున్నాం. ఉచిత బస్సు ప్రయాణం ఇచ్చి బస్సుల సంఖ్యను తగ్గించారు.

బీడీ కార్మికులకు పెన్షన్ ను 4 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. తక్షణమే దాన్ని అమలు చేయాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేస్తున్నాను.

## హొంగార్డులకు జీతాలు చెల్లించకపోవడం సిగ్గుచేటు

(మొదటి పేజీ తరువాయి)

దుస్థితి. ఈఎంఐలు చెల్లించక పోవడం వల్ల బ్యాంకు అధికారులు ఫోన్లు చేసి నిలదీస్తున్న పరిస్థితి. కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన నాటి నుండి ప్రతి నెలా ఇదే తీరు కొనసాగుతున్నా పట్టించుకునే వారే లేరు.మాటలు కోటలు దాటితే, చేతలు గడప దాటని ముఖ్యమంత్రి వీరికి ఏం సమాధానం చెబుతారు? పథకాల్లో కోతలు, జీతాలు చెల్లించకుండా ఉద్యోగులకు వాతలు.ఇది ప్రజా పాలన కాదు, ప్రజా వ్యతిరేక పాలన. హొంగార్డులకు వేతనాలు తక్షణం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

## బీర్ల ధరలు పెంచడం దేనికి సంకేతం?

(మొదటి పేజీ తరువాయి)

హొంగార్డులకు జీతాలు పెంచి కేసీఆర్ వారికి గౌరవం ఇచ్చారు. పోలీసుల స్థాయికి హొగార్డు లను కేసీఆర్ తీసుకువెళ్లారు. రిటైర్మెంట్ అవుతున్నామని ప్రభుత్వ ఉద్యోగులు భయపడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్కరికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాలేదు వాలంటరీ రిటైర్మెంట్ ఇవ్వడానికి భయ పడుతున్నారు. ఆర్టీసీ పరిస్థితి రోడ్ల మీదకు వచ్చింది. కార్పోరేషన్లకు 50 రూపా యలు ఇవ్వలేదు. హాస్టళ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. వరంగల్ డిక్లరేషన్మలు కాలేదు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీకి గుండు సున్నా వచ్చింది. హొంగా ర్డులను వెంటనే పర్మినెంట్ చేయాలి. యూనిఫామ్ సర్వీసులో ఉన్న వారు తెలంగాణ గురించి కొట్లాడారు.. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసి లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించాలి. బీసీలకు 42 శాతం చట్టపరమైన రిజర్వేషన్లు ఇవ్వాలి.బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వేను బయటపెట్టండి. కుల గణన రీసర్వే చేయాలి.421 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇందిరాపార్కు వద్ద హొగార్డులతో ధర్నా చేస్తాము. సర్వశిక్షా అభియాన్ లో పనిచేసే వారిని ఛాయ్ తాగేలోపు పర్మినెంట్ చేస్తామని రేవంత్ రెడ్డి అన్నారు. బీర్ల ధరలు

ఎవరు చెప్తే పెంచారు? కొద్ది రోజుల్లో బ్రాందీ,విస్కీ ధరలు పెరుగుతాయి..ఏపీ ప్రభుత్వం చెప్తే ధరలు పెంచారా? ఏపీ, తెలంగాణ ఒక్కటై బీర్ల ధరలు పెంచారా? తెలంగాణ ఉద్యమంలో సర్వీస్ కోల్పోయారని మా హయాంలో ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు పెంచాము ఇప్పుడు రిటైర్మెంట్ వయసు పెంచాలని ఉద్యోగులు కోరుకోవడం లేదు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉద్యో గులకు జీతాలు ఇచ్చాము.

## కుల గణన ఓ బోగస్ సర్వే

(మొదటి పేజీ తరువాయి)

ఈ లెక్కన తెలంగాణ జనాభా 4 కోట్ల 30 లక్షలు దాటుతుంది. తెలంగాణలో ఆధార్ కార్డులున్న వారి సంఖ్య 3 కోట్ల 95 లక్షలు. కానీ కుల గణన సర్వేలో తెలంగాణ జనాభా 3 కోట్ల 70 లక్షలుగా కుదించడం పెద్ద బూటకం. ఇది ఉత్తుత్తి సర్వే మాత్రమే. బీసీ సామాజికవర్గంలోని వివిధ కులాలకు చెందిన జనాభాను కుల గణన పేరుతో ఉద్దేశపూర్వకంగానే తగ్గించే కుట్ర చేసినట్లు స్పష్టంగా కన్పిస్తోంది. కుల గణన సర్వే పేరుతో ప్రచారం చేసుకోవడం, స్థానిక సంస్థలను ఎదుర్కొనే దమ్ము లేక మళ్లీ 3.1 శాతం కుటుంబాలకు రీ సర్వే చేయాలనే సాకుతో మళ్లీ హైడ్రామా చేయడం సిగ్గు చేటు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను, అవినీతి, అక్రమాలను, ప్రచార యావను ప్రజలంతా గమనిస్తున్నారని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం కుల గణన విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలి. రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ వెళ్లి 'కుల గణన' పేరుతో రీ సర్వే చేయాలి. ఆధార్ కార్డులను లింక్ చేసి ఇంటింటికీ వెళ్లి రీ సర్వే నిర్వహించాలి. దీంతోపాటు సర్వే పూర్తయిన వెంటనే గ్రామ పంచాయతీల్లో, వార్డుల్లో ముసాయిదా జాబితాను ప్రదర్శించి అభ్యంతరాలను స్వీకరించాలి. గ్రామ సభలు, వార్డు సభల ఆమోదంతో తుది జాబితాను ప్రకటించాలి. ఆ జాబితా మొత్తాన్ని పబ్లిక్ డొమైన్ లో ఉంచాలి. అప్పుడు మాత్రమే శాస్త్రీయ పద్ధతిలో కుల గణన జరిగినట్లుగా భావిస్తాం. అట్లాకాకుండా రాజకీయ ప్రయోజనాల కోసం, ప్రచారం కోసం తూతూ మంత్రంగా సర్వే చేయడంవల్ల ఏ మాత్రం ఉపయోగం ఉండదు. ఇకనైనా చేసిన తప్పులను సరిదిద్దుకోవాలి. ముస్లింలను బీసీ జాబితాలో చేర్చినా, బీసీ సామాజిక కులాల జనాభాను తగ్గించాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని భారతీయ జనతా పార్టీ పక్షాన హెచ్చరిస్తున్నాం.కుల గణన విషయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రుల మధ్యే ఏకాభిప్రాయం కొరవడింది. అట్లాగే బీసీ జాబితాలో ముస్లింలను చేర్చడాన్ని సొంత పార్టీ వాళ్లే తప్పు పడుతుంటే చేసిన తప్పును సరిదిద్దుకోకుండా కేంద్రంపై నిందలు మోపి తప్పించుకోవాలకోవడం సిగ్గు చేటు.

## ఫ్రాన్స్‌లో యుద్ధవీరులకు మోడీ నివాళి

(మొదటి పేజీ తరువాయి)

హాజరయ్యారు. మార్సెయిల్‌లో భారత కాన్సులేట్ కార్యాలయాన్ని కూడా మోదీ, మాక్రాన్ సంయుక్తంగా ప్రారంభించారు. కాంటినెంటల్ ఫ్రాన్స్‌లో తొలి భారత రాయబార కార్యాలయం ప్రారంభించడం ద్వారా ఇరుదేశాల మధ్య మరింత లోతైన సంబంధాలు ఏర్పడటంతో పాటు ఇరుదేశాల ప్రజల మధ్య సంబంధాలు, మల్టీ డైమన్షయల్ రిలేషన్‌షిప్‌కు బలం చేకూరిందని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ తెలిపారు. దీనికి ముందు పారిస్‌లో జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమ్మిట్‌లో మాక్రాన్‌తో కలిసి సదస్సుకు మోద అధ్యక్షత వహించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇచ్చిన విందులో పాల్గొన్నారు. ఫ్రాన్స్ పర్యటన అనంతరం ప్రధాని అమెరికా పర్యటనకు బయలుదేరుతున్నారు. రెండో దఫా అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పగ్గాలు చేపట్టిన తర్వాత ఆదేశంలో మోదీ పర్యటించనుండటం ఇదే ప్రథమం.

# దశాబ్దాల ఓబీసీల కల నిజం చేస్తాం..

(మొదటి పేజీ తరువాయి)

విజయవంతం అయితే దేశమంతా చేయాల్సి వస్తుంది అనుకునేవారు రీ సర్వే కోరుతున్నారు బీసీల దశాబ్దాల కల నెరవేర్చేందుకు ప్రజా ప్రభుత్వంతో రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, మేధావులు కలిసి రావాలి

రాష్ట్రంలో ఓబీసీలకు విద్య, రాజకీయ, ఆర్థిక రంగాల్లో 42% రిజర్వేషన్ కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, దశాబ్దాల బీసీల కలను నిజం చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఆయన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు మార్చి మొదటి వారంలో అసెంబ్లీలో ఓ బీసీల రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింప చేస్తాం అన్నారు.

శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదించిన బిల్లును.. పార్లమెంట్లో కూడా ప్రవేశపెట్టి ఆమోదం పొందడానికి కావలసిన అన్ని ప్రయత్నాలు చేస్తాము దేశంలోని అన్ని రాజకీయ పార్టీలపై ఒత్తిడి తెస్తాం అన్నారు.

పార్లమెంట్లో బిల్లు ఆమోదం కోసం కలిసి వచ్చే రాజకీయ పార్టీలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఢిల్లీకి ప్రతినిధి బృందం వెళుతుందని తెలిపారు. పార్లమెంట్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం దేశంలోని అన్ని రాజకీయ పార్టీలను కూడా కడతాం అన్నారు.

ఇంటింటి సర్వేలో వివరాలు నమోదు చేసుకోని వారికోసం మరో అవకాశం ఇస్తామన్నారు. రాష్ట్రంలో మూడు శాతం కుటుంబాలు సర్వేలో పాల్గొనలేదు వారికి మరోసారి అవకాశం ఇస్తున్నట్టు తెలిపారు. కెసిఆర్ కేటీఆర్ పల్లా వంటి వారు ఉద్దేశపూర్వకంగా సమాచారం ఇవ్వలేదు, మరి కొందరు అందుబాటులో లేకుండా పోయారు వారందరి కోసం మరోసారి అవకాశం ఇస్తున్నట్టు తెలిపారు.

ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు సమగ్ర ఇంటింటి సర్వేలో వివరాల నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని తెలిపారు.టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని కోరితే అధికారులు ఫోన్ చేసిన వారి ఇంటికి వెళ్లి అన్ని వివరాలు నమోదు చేసుకుంటారని తెలిపారు..

మండల కార్యాలయాల్లో ప్రజా పాలన అధికారులు ఈ పది రోజులు అందుబాటులో ఉంటారు. అక్కడ వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.ఆన్ లైన్ ద్వారా కూడా కుటుంబ వివరాలు నమోదుకు అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు.ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనేది అందరి కోరిక బలమైన లక్ష్యం సహకరించిన వారందరికీ ధన్యవాదాలు అన్నారు.

రాష్ట్ర జనాభాలో ఓబీసీలు 56 శాతంగా ఉన్నట్టు డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, చీఫ్ సెక్రటరీ శాంతకుమారి, ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణ భారతదేశంలో ఆధ్యాత్మిక యాత్రకు పవన్ శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

అకిరా నందన్, టీటీడీ బోర్డు సభ్యుడు ఆనంద్ సాయి ఉన్నారు. అగస్త్య ఆలయం ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడు డాక్టర్ యోగిదాస్, ఇతర సభ్యులు పవన్ కల్యాణ్‌కు ఘన స్వాగతం పలికారు.

కేరళ సంప్రదాయంతో ఆలయ పండితులు పవన్ పూర్ణకుంభతో స్వాగతం పలికారు. తర్వాత ఆయనతో ఆలయ సంప్రదాయాలను అనుసరించి ప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీ అగస్త్య మహర్షి వారికి పవన్ సంప్రదాయబద్ధంగా మొక్కులు చెల్లించుకుని విశేష పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో ఉన్న ఇతర మహా రుషుల ఆలయాలను దర్శించు కున్నారు. ఆలయ ఆకృతిని, కట్టడాలను ఆసక్తిగా తిలకించారు.

### ఆశ్రమ వివరాలను ఆసక్తిగా తెలుసుకున్న పవన్

అగస్త్య ఆశ్రమంలో ఆయుర్వేద వైద్యంలో ఉపయోగించే మూలికలు, మొక్కల గురించి ఆశ్రమ వైద్యులు విష్ణు యోగి, మణి యోగి వివరించారు. అగస్త్య మహర్షి పురాణాల్లో, వేదాల్లో చెప్పినట్టుగా కీలకమైన మర్మ చికిత్సకు మూలికలు ఎలా ఉపయోగపడతాయి అన్నది కూడా అడిగి తెలుసుకున్నారు. కలరిపయట్టు యుద్ధకళ గొప్పదనం గురించి, ఆశ్రమం ఆవరణలోనే ఉన్న శివలింగం ప్రాసస్త్యాన్ని కూడా పవన్ తెలుసుకున్నారు. లింగ శక్తి, శ్రీ శక్తి గురించి వివరించే పటాలను, చిత్రాలను పరిశీలించారు.



శివలింగం చెంతనే ఉన్న అఖండ జ్యోతికి నమస్కరించారు. అనంతరం అగస్త్య ఆశ్రమంలోనే ఉన్న గోశాలకు వెళ్లారు. ఆయుర్వేద చికిత్సలో గోవుల గొప్పతనాన్ని కూడా ఆశ్రమ నిర్వాహకులు పవన్ కు వివరించారు.

### ఆయుర్వేద వైద్యం గురించి...

సుదీర్ఘంగా పవన్‌ను బాధపెడుతున్న నడుము నొప్పి, స్పాండిలైటిస్ సమస్యకు ఆయుర్వేదంలో అవలంబించే చికిత్స విధానాలను పవన్ ఆశ్రమ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. శ్రీ అగస్త్య మహర్షి దర్శనం అనంతరం ఆశ్రమంలో ప్రత్యేకంగా అందించే చికిత్సాలయాన్ని సందర్శించారు. శ్రీ అగస్త్య ఆశ్రమానికి సుదూర ప్రాంతాల నుంచి వివిధ ఆరోగ్య సమస్యలకు చికిత్స నిమిత్తం ప్రతి రోజు 200 మందికి పైగా వస్తుంటారు. సుమారుగా 100 పడకల ప్రత్యేక వైద్యశాల వీరికి ఉంది. దీనికోసం 12 మంది వైద్యులతోపాటు సిబ్బంది ఇక్కడ పని చేస్తుంటారు. వివిధ దీర్ఘకాలిక నొప్పులు అలాగే ఎముకలకు సంబంధించిన ఇబ్బందులు ఉన్నవారికి వీరు ప్రత్యేకంగా ఆయుర్వేదంతోపాటు మర్మ చికిత్సను చేస్తారు.

ఆయుర్వేదం మనిషిపై ప్రభావం చూపడానికి కాస్త సమయం తీసుకుంటుందిగాని, కచ్చితంగా దీర్ఘకాలంలో ఆరోగ్యానికి మంచిదని వైద్యులు పవన్ కి చెప్పారు. దీంతోపాటు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆయుర్వేదంలో ఉన్న చికిత్స పద్ధతులను వివరించారు. అగస్త్య మహర్షి వేదాల్లో వివరించిన చికిత్స పద్ధతులు, సంప్రదాయాల గురించి ఆశ్రమ వైద్యులు పవన్ కు వివరించారు.

# స్థానిక ఎన్నికలు మరింత ఆలస్యం

(మొదటి పేజీ తరువాయి)

అవకాశం ఉంది. తాజాగా బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్ లో పంచాయతీ ఎన్నికలపై సీఎస్ శాంతి కుమారి, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు బీసీ రిజర్వేషన్లపై క్లారిటీ వచ్చిన వెంటనే షెడ్యూల్ రిలీజయ్యే అవకాశం ఉంది. 42శాతం సీట్లు ఇవ్వడానికి సుప్రీంకోర్టు తీర్పులు అడ్డొస్తున్న నేపథ్యంలో పాత పద్ధతినే అమలు చేస్తారని తెలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు యాభైశాతం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. అంతకన్నా ఎక్కువ సీట్లు కేటాయించాలంటే రాజ్యాంగ సవరణ జరగాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఉభయ సభలను సమావేశపర్చి రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. ఈ తరుణంలో అది సాధ్యం కాదని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ.. ఒక అడుగు ముందుకు వేసింది. తమ పార్టీ 42శాతం సీట్లను బీసీలకు కేటాయిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్ ఇటీవలే రైతు భరోసా మొత్తాన్ని కర్షకుల ఖాతాల్లో జమ చేసింది. బీసీ కులగణన చేపట్టి 56 శాతం వెనుకబడిన వర్గాల వారున్నారని తేల్చింది. వారికి రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పించేందుకు అడ్డంకులున్న దృష్ట్యా పార్టీగా ప్రకటిస్తామని వివరించింది. ముందుగా పార్టీ గుర్తుతో సంబంధం లేకుండా జరిగే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఏక గ్రీవాలు అధికంగా చేయడం ద్వారా మెజార్టీ పంచాయతీలను హస్తగతం చేసుకోవాలని భావించింది. ఈసీ నోటా అంశాన్ని తెరమీదకు తేవడంతో కొంత ఇబ్బంది పడ్డ కాంగ్రెస్.. ఇవాళ నిర్వహించిన ఆల్ పార్టీ మీటింగ్ లో ఒకే అభ్యర్థి బరిలో ఉంటే నోటాతో పోటీ పెట్టే అంశాన్ని వ్యతిరేకించింది. గెలిచిన సర్పంచులు.. అభివృద్ధి కోసం తమ పార్టీలో చేరుతారని భావిస్తోంది. వారిని చేర్చుకొని వాళ్ల అండతో ఎంపీటీసీ ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమయ్యే అవకాశ ఉంది. ఇలా చేయడం ద్వారా మెజార్టీ మండలాల్లో పాగా వేయొచ్చన్నది కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. సుప్రీంకోర్టు తీర్పులు అడ్డొస్తున్న నేపథ్యంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా షెడ్యూల్ విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం బీసీలకు కొంచం తక్కువ 23 శాతం సీట్లను కేటాయించనుంది. అదే విధంగా ఎస్సీ, ఎస్టీలకు 28శాతం స్థానాలను కేటాయించే అవకాశం ఉందని సమాచారం. దీనిపై న్యాయ సమీక్ష జరిగిన తర్వాత ఎలాంటి ఆటంకాలు రావని నిర్ధారించుకున్న మీదటే షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది.

## మాఘపూర్ణిమతో కుంభమేళాకు పోటెత్తిన భక్తులు

(మొదటి పేజీ తరువాయి)

మాఘ పూర్ణిమ వేళ బుధవారం మధ్యాహ్నం 12గంటల వరకే త్రివేణీ సంగమం, ఇతర ఘాట్‌ల వద్ద దాదాపు 1.60 కోట్ల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం వెల్లడించింది. బుధవారం మాఘ పూర్ణిమ వేళ భక్తుల తాకిడి అధికంగా ఉండటంతో మరింత కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు కుంభ్ మేళా డీఐజీ వైభవ్ కృష్ణ తెలిపారు.

ఈ మాఘ పూర్ణిమ స్నానంతో తమ నెల రోజుల కల్పవాసీ దీక్ష ముగించుకొని దాదాపు 10లక్షల మంది మహా కుంభమేళా నుంచి తిరుగు ప్రయాణం కానున్నారు. దీంతో వారంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పార్కింగ్ స్థలాలను మాత్రమే వినియోగించాలని అధికారులు కల్ప వాసీలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు, భక్తులపై హెలికాప్టర్ నుంచి పూల వర్షం కురిపించారు. లఖ్‌నవూలోని తన అధికారిక నివాసం నుంచి సీఎం యోగి ఆదిత్యనాథ్ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. వార్‌రూమ్‌లో సీఎంతో పాటు డీజీపీ ప్రశాంత్ కుమార్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ ప్రసాద్, సీఎం కార్యాలయం అధికారులు ఉన్నారు.

మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే తన సతీమణితో కలిసి త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానం ఆచరించారు. ప్రయాగ్‌రాజ్‌కు మంగళవారమే చేరుకున్నారు. సాధారణ యాత్రకుడిగా పడవపై సంగమం వద్దకు చేరుకొని పూజలు నిర్వహించారు. మరోవైపు, ఫిబ్రవరి 11వ తేదీ వరకు మొత్తంగా 46.25 కోట్ల మంది భక్తులు మహా కుంభ్‌కు విచ్చేసి పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు వెల్లడించారు.


## నోటాను కల్పిత అభ్యర్థిగా ప్రతిపాదించిన ఇసి

(మొదటి పేజీ తరువాయి)

వద్దా అనే అంశం రాజకీయ పార్టీ ల అభిప్రాయం తీసుకుంది. రాజకీయ పార్టీ ల ముందు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రతిపాదనలు పెట్టింది. ఎన్నికల ఫలితాలను ప్రకటించేటప్పుడు నోటాను 'కల్పిత ఎన్నికల అభ్యర్థి'గా పరిగణించడం, పోటీ చేస్తున్న అభ్యర్థి , 'కల్పిత ఎన్నికల అభ్యర్థి' అంటే నోటా అత్యధిక సంఖ్యలో సమాన ఓట్లను పొందినట్లయితే, పోటీ చేస్తున్న అభ్యర్థి ఎన్నికైనట్లు ప్రకటించడం. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ వ్యక్తిగతంగా 'కల్పిత ఎన్నికల అభ్యర్థి' అంటే నోటా కంటే తక్కువ ఓట్లు పొందినట్లయితే, పోటీ చేస్తున్న అభ్యర్థులలో ఎవరూ ఎన్నికైనట్లు ప్రకటించబడరు. ఎవరు ఎన్నిక కానట్లు అయితే, ఆ స్థానానికి తిరిగి ఎన్నిక నిర్వహించబడుతుంది. నోటా కంటే తక్కువ ఓట్లు పొందిన పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ తిరిగి ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులు కారు? తిరిగి ఎన్నికలో, నోటాకు మళ్లీ అత్యధిక ఓట్లు వస్తే, తదుపరి ఎన్నికలు నిర్వహించబడవు, అత్యధిక ఓట్లు ఉన్న పోటీ చేస్తున్న అభ్యర్థి ఎన్నికైనట్లు ప్రకటించబడుతుంది. ఈ ప్రతిపాదనలు పై రాజకీయ పార్టీ లు భిన్న అభిప్రాయాలను వెలిబుచ్చాయి. కాంగ్రెస్ పార్టీ కల్పిత అభ్యర్థిగా పరిగణించడాన్ని వ్యతిరేకించింది? నోటా ఎక్కువ ఓట్లు వచ్చి ఎన్నికలు మళ్ళీ నిర్వహించాలని అంటే అటు ప్రభుత్వానికి, ఇటు అభ్యర్థులకు ఖర్చు పెరుగుతుందని ఆ పార్టీ నేతలు అన్నారు. ఏకగ్రీవానికి బెదిరింపులు, బలప్రదర్శన చేసే అవకాశం ఉందనీ ఆ పార్టీ పేర్కొంది. సుప్రీంకోర్టు లో కేసు ఉందని మా అభిప్రాయం ఇప్పుడే చెప్పలేమని బీజేపీ అంది. స్టేట్ ఎలక్షన్ కమిషన్ కు ఈ విషయంపై నిర్ణయం తీసుకునే అవకాశం లేదనీ పంచాయతీ ఎన్నికలు ఎలా నిర్వహించాలనే నిర్ణయం తీసుకోవాల్సింది ప్రభుత్వం అని స్పష్టం చేసింది. నోటా తో ఎన్నిక ఉండాలని సుప్రీంకోర్టు ఇప్పటికే చెప్పింది. నోట ఉండాలని అయితే అభ్యర్థి కంటే నోటాకు ఎక్కువ ఓట్లు వస్తె రీ ఎలక్షన్ కరెక్ట్ కాదనీ సిపిఎం చెప్పింది?.తమ అభిప్రాయాన్ని రెండు రోజుల్లో చెప్తామని టిటీడీపీ చెప్పగా సింగల్ కాండిడేట్ ఉన్నా నోటా ఉండాలన్న జనసేన పార్టీ.. చెప్పింది. రాష్ట్రంలో సర్పంచ్ పదవుల వేలంను అరికట్టడానికి కల్పిత అభ్యర్థి నిర్ణయం అని రాష్ట్ర ఎన్నికల సంఘం అంటుంది.

ఇప్పటికే మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాలు కల్పిత అభ్యర్థి విధానం ను అవలంభిస్తున్నాయని ఎన్నికల సంఘం రాజకీయ పార్టీ ల ముందు పెట్టింది.

# వనపర్తికి ఐ.టి టవర్ మంజూరు రూ.22 కోట్లు విడుదల



- ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి

హైదరాబాద్,ఫిబ్రవరి12(వార్త వేదిక సూర్య): వనపర్తి జిల్లాకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) టవర్ మంజూరు అయిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి తెలిపారు. బుధవారం బిఆర్ అంబేద్కర్ సచివాలయ మీడియా సెంటర్లో విలేకరుల సమావేశంలో జి. చిన్నారెడ్డి ఐ.టి టవర్ మంజూరు అంశాలను వెల్లడించారు. వనపర్తి లో ఐటీ టవర్ నిర్మాణం కోసం రూ 22 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఐ టీ శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని చిన్నారెడ్డి తెలిపారు.

ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ వన్ తేదీ 11-2-2025 ద్వారా ఉత్తర్వులు జారీ చేసిందని చిన్నారెడ్డి పేర్కొన్నారు.

వనపర్తి పట్టణ శివారులోని నాగవరం గ్రామంలోని రెండు ఎకరాల స్థలంలో ఐటీ టవర్ నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. 25 వేల చదరపు అడుగుల లో ఐటీ భవన నిర్మాణం జరుగుతుందని ఈ భవనంలో ఏకకాలంలో 250 మంది ఐటి ప్రొఫెషనల్స్ పనిచేసుకునే సౌకర్యం ఉంటుందని చిన్నారెడ్డి వివరించారు.

గ్రామీణ ప్రాంతంలో ఐటి అబ్బులను అభివృద్ధి చేయడంలో భాగంగా వనపర్తికి ఐటి టవర్ మంజూరు అయిందని సామాజిక ఆర్థిక అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి సౌకర్యం కల్పించేందుకు ఈ ఐటి టవర్ ను వనపర్తి లో ఏర్పాటు చేస్తున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు.

వనపర్తి కి మంజూరు అయిన హైటు టవర్ ను ఒక సంవత్సరం కాలంలో నిర్మాణం పూర్తి చేసుకునే విధంగా లక్ష్యాన్ని నిర్ణయించుకున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు. ఐటీ ప్రొఫెషనల్ ప్రొఫెషనల్ స్కూల్ ఐటీ టవర్ నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని వనపర్తి జిల్లాకు ఇది శుభవార్త అని చిన్నారెడ్డి తెలిపే పేర్కొన్నారు. వనపర్తి ప్రాంతంలో విద్యాభ్యాసం చేసిన ముఖ్య మంత్రి ఏ రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ వల్ల ఐటీ టవర్ మంజూరు అయిందని, అందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చిన్నారెడ్డి పేర్కొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

లేదంటే యుద్ధం తప్పదని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లను పెంచకుండా పార్టీ పరంగా టికెట్లు ఇస్తామని సీఎం రేవంత్ ప్రకటించడం బీసీలను మోసం చేయడమేనని ఆర్. కృష్ణయ్య విమర్శించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచు తామని ప్రకటించారని, ఇప్పుడు తప్పించుకోవడానికి కుట్ర చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. రిజర్వేషన్లు పెంచకుండా కులాల వారీగా జనాభా లెక్కలు తప్పుగా చూపిస్తూ ప్రజల దృష్టి మరల్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని సీఎంపై కృష్ణయ్య ఆరోపణలు చేశారు.

# ఇంటర్మీడియట్ పరీక్షలు రాయబోయే విద్యార్థులకు మానసిక నిపుణులచే కౌన్సిలింగ్ ఇప్పించాలి

### ఇంటర్మీడియట్ బోర్డ్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జయప్రద కు వినతి పత్రం అందచేసిన బీసీ నేత లింగంగౌడ్



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 12(వార్త వేదిక సూర్య):** మార్చి 5 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులు కలిగే భయాన్ని పోగొట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు అయిపోయింతవరకు మానసిక నిపుణులచే కౌన్సిలింగ్ ఇప్పించి వారిలో ఉన్న బయోందోళనలు పోగొట్టాలని కోరుతూ నాంపల్లి లోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో ఇంటర్మీడియట్ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ జయప్రద గారికి విజ్ఞప్తి చేసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ పరీక్షలు దగ్గర పడుతున్న కొద్ది ఇంటర్ విద్యార్థుల్లో ఒత్తిడి పెరిగి భయంతో మానసికంగా కృంగిపోయే అవకాశం ఉందని, విద్యార్థులో ఆత్మనూన్యత భావం ఎక్కువగా ఉంటుందని కొంతమంది బయటకు చెప్పుకోలేక తమలో తామే కృంగిపోతారని వారికి మానసిక నిపుణులు, సైకాలజిస్టులచే కౌన్సిలింగ్ ఇప్పించాలని అన్నారు. యోగా, మెడిటేషన్ తరగతుల వంటివి కూడా నిర్వహించాలన్నారు. తెలంగాణ విద్యార్థి యువజన యువజన పరిషత్ స్టేట్ ప్రెసిడెంట్ బూర శ్రీనివాస్,ఓయూ జేఏసీ ప్రెసిడెంట్ బండి నరేష్,మాల విద్యార్థి సంఘం స్టేట్ ప్రెసిడెంట్ చంద్ర మోహన్ రాయ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు గోదా రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ధర్మద్రోహులను క్షమించేది లేదు : వి.హెచ్.పి

- వి హెచ్.పి రాష్ట్ర ప్రతినిధి బృందం పరామర్శ
- ఎంతటి విపత్కర పరిస్థితిలోనైనా అండగా ఉంటామని భరోసా
- దుర్మార్గుల చేతిలో చిత్రహింసలు అనుభవించానని రంగరాజన్ ఆవేదన
- వి.హెచ్.పి అండగా నిలబడటం కొండంత బలాన్ని ఇచ్చింది
- చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు సిఎస్ రంగరాజన్ స్వామి





**మొయినాబాద్,ఫిబ్రవరి 12(వార్త వేదిక సూర్య):** మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు శ్రీ రంగరాజన్ గారిపై దాడికి పాల్పడిన ధర్మ ద్రోహులను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. రాముడునీ అడ్డం పెట్టుకొని ధర్మం పై దాడి చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించింది. బుధవారం సాయంత్రం విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రతినిధి బృందం వెళ్లి చిలుకూరులో రంగరాజన్ గారిని పరామర్శించింది. దాదాపు అరగంట పాటు మాట్లాడి, జరిగిన ఘటన గురించి అన్ని విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా రంగరాజన్ గారికి విశ్వహిందూ పరిషత్ అన్నివేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించింది.

ఎటువంటి విపత్కర పరిస్థితిలోనైనా ధర్మరక్షణకు తాము కట్టుబడి ఉంటామని విశ్వహిందూ పరిషత్ నాయకులు స్పష్టం చేశారు. దాడి ఘటన తమను తీవ్రంగా కలిసి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్మం ముసుగులో కొంతమంది హిందుత్వాన్ని అభాసుపాలు చేసే ప్రయత్నం చేస్తున్నారని.. దీనిని యావత్ హిందూ సమాజం తీవ్రంగా పరిగణించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో రాడికల్ సిష్టానికి, చెట్ట వ్యతిరేక శక్తులకు తావు లేదని పేర్కొన్నారు. ఎంతటి వ్యక్తులైన కూడా చట్టానికి లోబడే పని చేయాలని సూచించారు.

ధర్మం పేరు చెప్పి దౌర్జన్యాలకు పాల్పడటం, వ్యాపారాలు చేయడం ధర్మద్రోహం అని అన్నారు ఈ సందర్భంగా రంగరాజన్ మాట్లాడుతూ.. విశ్వహిందూ పరిషత్ తమకు అండగా నిలబడటం కొండంత బలాన్ని ఇచ్చిందని అభిప్రాయపడ్డారు. విశ్వహిందూ పరిషత్ అంటే తమ కుటుంబమని పేర్కొన్నారు. దాడి చేసిన దుండగులను దేవుడే చూసుకుంటాడని పేర్కొన్నారు. దాడి ఘటనలో తనను చిత్ర హింసలకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ తాను సంయమనం పాటించి, ద్రోహులను, అరాచక శక్తులను చట్టానికి పట్టించాలని చెప్పారు. తాను సంయమనం కోల్పోయి ఉంటే, పరిస్థితి మరోలా ఉండేదని వివరించారు. ఏది ఏమైనా విశ్వహిందూ పరిషత్ ధర్మకర్యం మరింత పెరగాలని సూచించారు.

ఈ సందర్భంగా రంగరాజన్ గారికి పూలమాలలు వేసి నాయకులు అభినందనలు తెలియజేశారు.

కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ రామ్ సింగ్, డాక్టర్ సునీత రెడ్డి గారు, రాష్ట్ర నాయకులు చింతల వెంకట్ రెడ్డి, ప్రచార ప్రసార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, మాతృ శక్తి రాష్ట్ర కన్వీనర్ శ్రీమతి పద్మశ్రీ గారు, దుర్గా వాహిని రాష్ట్ర కన్వీనర్ శ్రీమతి వాణి సక్కుబాయి గారు, డాక్టర్ ప్రేమలత అనంతగిరి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ రంగనాథ్ గారు, నాయకులు నందకిషోర్, మధుసూదన్ రెడ్డి, హరినాథ్ పాల్గొన్నారు





# చేవెళ్ల నూతన బస్టాండ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య

**మొయినాబాద్,ఫిబ్రవరి 12(వార్త వేదిక సూర్య):** చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని చేవెళ్ల నూతనంగా నిర్మించిన బస్టాండ్ ను ప్రారంభించిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరు కోట్ల హెచ్ఎండిఏ నిధులతో చేవెళ్ల బస్టాండ్ ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది అన్నారు ఈ బస్ స్టేషన్ రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వం పూర్తి సహకారంతో నిర్మించుకున్నాను తెలంగాణ రాష్ట్ర రోడ్డు వాహనాల మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో బస్టాండ్ ఇంత ఇంత అందంగా తీర్చిదిద్దుకున్నాం. 10 ప్లాట్ఫామ్ లతో ప్రతిరోజు 130 బస్సులు ఈ బస్టాండ్ వస్తుంటాయి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శంకర్పల్లి తాండూరు వికారాబాద్ యాదగిరి పరిగి కోస్గి కొడంగల్ హైదరాబాద్ షాద్నగర్ ప్రజలందరూ కూడా ఉచిత ఆర్టీసీ బస్సు సద్వినియం చేసుకోవాలని కోరారు రాబోయే రోజులలో ప్రభుత్వం ద్వారా ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు వచ్చే విధంగా చేస్తామని అన్నారు ఈ రంగారెడ్డి జిల్లాలోని మొట్టమొదటిగా ఇంత అద్భుతంగా బస్టాండ్ నిర్మాణానికి సాయి శక్తుల కష్టపడి ముందుకు నిధులను తీసుకువచ్చిన మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలోని కాంట్రాక్టర్ శ్రీనివాస్ ఆర్టీసీ సిబ్బంది వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు..

# బీజేఎంసీలో సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేసిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

**గండిపేట్, (వార్త వేదిక సూర్య) :** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రావులకోల్ల నాగరాజు కార్పోరేషన్ కమిషనర్ శరత్ చంద్రను కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ను కలిసి పలు సమస్యలను వివరించి వినతి పత్రాన్ని అందజేశారు.



ఈ సందర్భంగా రావులకోల్ల నాగరాజు మాట్లాడుతూ.. ప్రధానంగా స్థానికంగా దోమల బెడద తీవ్రమైందని అన్నారు. దీని కారణంగా మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి ప్రమాదకర వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. ఈ మేరకు అధికారులు కనీసం రెండు రోజులకు ఒకసారి దోమల మందు పిచికారి, ఫాగింగ్ చర్యలను తీసుకోవాలన్నారు. అంతేకాకుండా స్థానికంగా కుక్కల బెడద తీవ్రమైందని అన్నారు. రోడ్లపై కాలు పెట్టాలంటేనే ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు, సైకిల్, ద్విచక్ర వాహనదారులపై వెంటపడి కరుస్తున్నాయన్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. అంతే కాకుండా కొన్ని కాలనీలలో హైమాస్ట్ లైట్లు వెలగడం లేదని దీంతో కాలనీలో అంధకారంలోనే ఉండిపోవాల్సి వస్తుందన్నారు. తద్వారా అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. స్థానికంగా ప్రభుత్వ పార్కు స్థలాలను కాపాడాలని కమిషనర్ను కోరినట్లు వివరించారు.

ఈ మేరకు కమిషనర్ సానుకూలంగా స్పందించారని బిఆర్ఎస్ నాయకులు వివరించారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాముడు యాదవ్, బీసీ సంఘం నాయకులు చందు గౌడ్, రవికుమార్, చందర్రావు, శాంతి నాయక్, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.






## సోమాజిగూడ గణపతి ఆలయ 25 వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 12(వార్త వేదిక సూర్య):** సోమాజిగూడ డివిజన్ అమీర్పేట్ లోని గణపతి ఆలయం లోని 25 వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ మంత్రి వర్యులు ఖైరతాబాద్ శాసనసభ్యులు దానం నాగేందర్ స్థానిక కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ తో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థా ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ఆ యొక్క గణపతి ఆశీస్సులు ఎల్లపుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డ్ మెంబర్ నాగరాజు, విజయ్ యాదవ్, హరికృష్ణ, బాషా, ఎన్.గణేష్ తదితరులు పాల్గొన్నారు

## ఇది బీసీల విజయం : లింగంగౌడ్

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 12(వార్త వేదిక సూర్య):** కులగణన సర్వేను రీ సర్వే చేస్తామని, అంతేకాకుండా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచి చట్టబద్ధత కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల



ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించడం పట్ల బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ హర్షం ప్రకటించారు. ఇది బీసీ సంఘాల విజయంగా ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా బీసీల య్నొక్క అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని మా యొక్క మనోభావాలను గుర్తించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు గోదా రవీందర్ పాల్గొన్నారు

## మందకృష్ణ మాదిగకు పద్మ శ్రీ రావడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన ఖానాపూర్ నాయకులు

**గండిపేట్, (వార్త వేదిక సూర్య) :** ఎస్సీ వర్గీకరణ పోరులో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఎంతో తెగువ చూపారని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్లగారి గణేష్ మాదిగ, కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా



ఉపాధ్యక్షులు పెద్దపులి కృష్ణ మాదిగలు అన్నారు. మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారం రావడం ఎస్సీ వర్గీకరణ పట్ల ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడంతో ఖానాపూర్ ఎమ్మార్పీఎస్ కమిటీ అధ్యక్షులు పెద్దపులి శంకర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మందకృష్ణ మాదిగలు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు డప్పు రాకేష్, రామేశ్వరం దేవదాస్, హెచ్.భిక్షపతి, సి.గోపాల్, కమిటీ సభ్యులు డప్పు రవీందర్, డప్పు కృష్ణ, ఆర్.పోచయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి మాజీ కౌన్సిలర్‌కు లేదు : కళ్లెం లక్ష్మారెడ్డి



**గండిపేట్, (వార్త వేదిక సూర్య):** మాజీ కౌన్సిలర్‌కు అభివృద్ధి గురించి ఇప్పుడు గుర్తుకు వచ్చిందా అని కాంగ్రెస్ పార్టీ నాయకులు కళ్లెం లక్ష్మారెడ్డి అన్నారు. ఇటీవల మాజీ కౌన్సిలర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను మాజీ కౌన్సిలర్ విమర్శించడానికి ఆయన తప్పుపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవతో పనిచేశారని అన్నారు. ఆయనను విమర్శించే స్థాయి మాజీ కౌన్సిలర్ కు లేదన్నారు. ఆయన స్థాయి ఎరిగి మాట్లాడాలని సూచించారు. మాజీ కౌన్సిలర్ గతంలో బాబుల్ రెడ్డి నగర్ కు ఏం చేశారో ఒకసారి ఆలోచించుకోవాలని హితువు పలికారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY



# స్థానిక సంస్థల ఎన్నికలలో
# కాంగ్రెస్ పార్టీకి అధిక స్థానాలు ఖాయం

### కాంగ్రెస్ పార్టీ యూత్ మండలాధ్యక్షుడు బట్టే సంతోష్ కుమార్



**రామన్నపేట,ఫిబ్రవరి 12 (వార్తా వేదిక సూర్య)** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో రామన్నపేట మండలంలో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు సాధిస్తుందని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బట్టే సంతోష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజాపాలనపై ప్రతిపక్ష నాయకులు చేస్తున్న ఆరోపణలను అపోహాలను ప్రజలు నమ్మొద్దని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 14 మాసాలలో పేద ప్రజల సంక్షేమం కొరకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ,200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిందని అన్నారు. ప్రస్తుతం రైతులకు రైతు భరోసా ఎకరాకు 6000 చొప్పున పంపిణీ చేశారు అని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల పరిపాలనలో పేదలకు ఒక్క రేషన్ కార్డు, ఒక్క ఇల్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇల్లు భూమి లేని పేద కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందజేయడానికి అర్హులైన వారి జాబితా రూపొందించి లబ్ధిదారులకు పంపిణీ చేయడానికి సన్నాహాలు చేపడుతుంటే ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై విమర్శలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వారి మాటలు నమ్మవద్దు అని అన్నారు.





# బిఆర్ఎస్‌తోనే రాష్ట్రం అప్పుల కుప్ప

**భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 12 (వార్తా వేదిక సూర్య)** ధనిక రాష్ట్రమైన తెలంగాణను గత పది ఏళ్ల బి ఆర్ఎస్ పాలకులు అప్పుల కుప్పగా మార్చారని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆరోపించారు. బుధవారం మండలంలోని అంతమ్మ గూడెం, ధోతి గూడెం, భీమనపల్లి కనుముకుల గ్రామాలలో నాయకులు, ప్రజలతో సమావేశమై ప్రజా సమస్యలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు మాయమాటలతో ప్రజల్ని మబ్య పెడుతూ పూనే దుబాయ్ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డులు, అందజేస్తామని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు . పిల్లాయిపల్లి కాలువ ,బు నాది గాని కాలువ ధర్మారెడ్డి పల్లి కాల్వ మరమ్మత్తుల కోసం 500 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గ ప్రాంతంలో 32 కొత్త బస్సులతో పాటు కొత్త రూట్లో బస్సులు నడిపేందుకు తగిన చర్యలు తీసుకున్నా మ ని తెలిపారు. పోచంపల్లి పెద్ద చెరువు పై మినీ ట్యాంక్ బండ్ ఏర్పాటుకు రూ. 9.5 కోట్ల నిధులు మంజూరు చేయించాలని , త్వరలో పనులు చేపడతారని తెలిపారు. చేనేత కార్మికుల కోసం త్రిఫ్ట్ పథకం కింద భూదాన్ పోచంపల్లి మండలా నికి 30 కోట్లు ఇవ్వడం జరిగిందని, మండలంలో అంతర్గత రోడ్లు, బీటీ రోడ్లు నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని తెలిపారు.

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాక మలేష్ యాదవ్, డిసిసి ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి , కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మర్రి నర్సింహారెడ్డి , జిల్లా నాయకులు తడక వెంకటేశం, తడక రమేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవ కుమార్ ,కొట్టం కరుణాకర్ రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్ రెడ్డి , నాయకులు అని రెడ్డి జగన్ రెడ్డి , కాసుల అంజయ్య, బాల%శీ% మల్లేష్, దారెడ్డి వేణుగోపాల్ రెడ్డి,గోరంటి శ్రీనివాస్ రెడ్డి,పడమటి భూపాల్ రెడ్డి, చింతల శ్రీశైలం, గునిగంటి రమేష్ , తోట శ్రీనివాస్,పాక జంగయ్య , జింకల జయసూర్య, ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయురాలు మృతి నిరసనగా మోత్కూరులో ర్యాలీ





**మోత్కూరు, ఫిబ్రవరి 12( వార్త వేదిక సూర్య):** రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మృతి చెందిన జబీన్ మృతికి కారకులైనా రోడ్డు కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మోత్కూరులో విద్యార్థుల రాజకీయ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే స్థానిక శ్రీకాంత్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ చేసి, రాస్తారోకో"ను నిర్వహించారు. అనంతరం జి.ప.ఉ.పా. తరగతులను బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎడ్ల నరేష్ మాట్లాడుతూ అడ్డగూడూరు మండలం చౌళ్లరామారం గ్రామంలో వద్ద మంగళ వారం రోడ్డు ప్రమాదానికి మృతి చెందిన ఉపాధ్యాయులు జబీన్ మృతికి కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణంగా ఆమె మృతి చెందిందని ఆరోపించారు ఈ జాతీయ రహదారిపై ఏలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్ల తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె మృతి కారకులైన వాహనాన్ని వెంటనే గుర్తించి అందుకు బాధ్యులైన వ్యక్తి తోపాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మృతి చెందిన బాధిత ఉపాధ్యాయురాలు కుటుంబానికి ప్రభుత్వం 50 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియ చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మల్లేబోయిన మహేష్, గడపాక నవీన్, వినయ్ కుమార్ విద్యార్థులు తదిరులు పాల్గొన్నారు.

# సామేల్‌పై వ్యతిరేకత అవాస్తవం : శ్రీనివాస్ రెడ్డి




**మోత్కూరు ఫ్రెబ్రవరి 12 ( వార్త వేదిక సూర్య)** తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్ పై కొంతమంధి జీర్ణించుకోలేక స్వార్ధ రాజకీయాలు చేస్తున్నారని మోత్కూరు వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

బుధవారం నాడు ఆయన మోత్కూరులో విలేకరులతో మాట్లాడుతూ సామేల్ ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుండి ప్రతి నిత్యం నియోజకవర్గ ప్రజలకు , కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ జిల్లా మంత్రులు, ఎంపీ సహకారంతో అభివృద్ధి పనులు చేస్తుంటే కొంతమంది నిజమైన కాంగ్రెస్ వాదులంటూ గత ఎమ్మెల్యే కనుసన్నల్లోనే పని చేసి నేడు సామేల్ పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు తుంగతుర్తి నియోజకవర్గం ఏర్పడి నాటి నుండి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇక్కడ గెలవలేదని 15 ఏళ్ల తర్వాత గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేగా బహుజన బిడ్డ సామేల్ గెలుస్తే సంతోషంగా లేకుండా చేయడమే కాకుండా కార్యకర్తలను నిరుత్సాహ పరిచి కాంగ్రెస్ పార్టీకి నష్టం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అడ్డగూడూరులో ఇసుక దందా చేసేవారికి మోత్కూరులో ఒక ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారితో కలిసి దోచుకుం దామన్న వాళ్లకు ఎమ్మెల్యే సహకరించకపోవడం వల్లనే కోమటిరెడ్డి బ్రదర్స్ కు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నట్లు లేనిపోని ఆరోపణలు చేస్తూ కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి, పాత కాంగ్రెస్ లో ఉన్నవారికి పార్టీలో వివక్ష రేపుతూ పార్టీకి నష్టం చేస్తున్నారని అన్నారు. రానున్న స్థానిక , మున్సిపల్ ఎన్నికల దృష్టిలో పెట్టుకొని కార్యకర్తలను గందరగోళం పర్చకుండా కష్ట కర్తలకు న్యాయం చేసే విధంగా సమిష్టిగా కృషి చేద్దామని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కూడా వాస్తవాలను పరీశీలించి, కాంగ్రెస్ పార్టీ కి మేలు విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

# మృతుల కుటుంబానికి ఆర్థికసాయం

**వలిగొండ ఫిబ్రవరి 12 (వార్తా వేదిక సూర్య):** మండల పరిధిలోని అరూరు గ్రామంలో ఇటివల అనారోగ్య కారణాల వల్ల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు సుంకిశాల పరమేశ్ మరియు అతని తండ్రి సుంకిశాల యాదయ్యలు మరణించగా మృతుల కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి మరియు గ్రామ శాఖ కార్యకర్తలు బుధవారం ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తు 25 వేల రూపాయలను వాకిటి అనంతరెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు 35 వేల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వలిగొండ జడ్పిటిసి వాకిటి పద్మ అనంత రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర నరసింహ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ సుక్క ముత్యాలు,మత్స్యగిరి దేవస్థానం డైరెక్టర్ కోడితల కరుణాకర్ ,యాదవ సంఘం అధ్యక్షులు కసిరబోయిన లింగయ్య యాదవ్, దమెర అంజయ్య , జక్కిడి మల్లారెడ్డి,సాయి రెడ్డి, బుర్ర శీను,బుర్ర శ్రీ శైలం,రెబ్బాస్ సత్తయ్య , మర్రి ముత్యాలు, చెమ్మయ్య, చంద్రయ్య వేముల ఎటయ్య, కసిరబోయిన నరసింహ , రామచంద్రం వినోద్, శ్రీను, వేముల రమేష్, ఎర్ర సాయి,మాటురి మెగులయ ,రెబ్బాస్ నరేష్,



ఐలపాక స్వామి, కోప్పుల దాసు, నల్ల సత్తయ్య, జినుకల మల్లేష్, బండ లింగ స్వామి, జక్కిడి శీను ,భోగారం కిష్టయ్య,నరాల మల్లయ్య, సుల్తాన్,షరిప్,జినుకల బాల నరసింహ, వేముల నరసింహ, బుర్ర శ్రీకర్, సుంకిశాల వెంకటేష్, నరసింహ, పోతే పాక కూమర్,సాయిలు, అంజయ్య,మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







## మున్నూరు కాపు సంఘం నాయకులు
# ముందస్తు అరెస్ట్

**మోత్కూరు, ఫిబ్రవరి 12 (వార్త వేదిక సూర్య):** మున్నూరు కాపు సమస్యల పరిష్కారానికి హైదరాబాద్ లోని బోయినిపల్లి జరిగే బహిరంగ సభ వెళ్తారనే ఉద్దేశంతో స్థానిక ఆ సంఘం నాయకులను మోత్కూరు పోలీసులు ముందస్తూ హౌస్ అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్ట్ అయినా వారిలో మాజీ సర్పంచ్ బయ్యని పిచ్చయ్య, కలిమెల నర్సయ్య, బయ్యని రాజు, కందుల విక్రాంత్, పోలినేని స్వామి నాయుడు, బయ్యని గిరి ప్రసాద్ లు ఉన్నారు.

# మోటకొండూరు విద్యుత్ ఏఈగా సుదర్శన్

### స్వాగతం పలికిన సెక్షన్ ఉద్యోగులు

**మోటకొండూరు/వార్తా వేధిక సూర్య:** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల విద్యుత్ ఏఈగా ఎన్ సుదర్శన్ నేడు బాధ్యతలు చేపట్టారు.వారికి మోటకొండూరు సెక్షన్ విద్యుత్ ఉద్యోగులు ఘనంగా స్వాగతం పలికారు.



శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో మోటకొండూరు పట్టణ లైన్మెన్ సత్తయ్య, కృష్ణారెడ్డి ,సత్తయ్య, బాలరాజు, ఏఎల్ఎం రమేష్, శ్రీధర్, మహేష్ ,నరేష్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు

# పొగాకు, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

**వలిగొండ ఫిబ్రవరి 12 (వార్తా వేదిక సూర్య):** మండల పరిధిలోని అరూరు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పొగాకు, నార్కోటిక్ డ్రగ్స్ పై డాక్టర్ సుమన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు డ్రగ్స్



వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పాఠశాలను పొగాకు రహిత సంస్థ గా ప్రకటించి సర్టిఫికెట్ అందజేశారు. విద్యార్థులు పరీక్షా సమయంలో ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా చసదువుకోని పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ప్రసిద్ధ్,సిబ్బంది ఇస్తారి, ప్రవీణ్, రమేష్, మరియమ్మ, శోభ, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## త్రైత సిందాంత భగవద్గీతపై
# ఇంటింటి ప్రచారం

**వలిగొండ ఫిబ్రవరి 12 (వార్తా వేదిక సూర్య):** మండల పరిధిలోని దుప్పెల్లి గ్రామంలో బుధవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందుజ్ఞాన వేదిక సమితి సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వామీ రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత,




అనుబంధ గ్రంథముల ప్రత్యేకతపై, పండుగలపై గ్రామంలోని ఇంటింటికి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భముగావారు మాట్లాడుతూ పూర్వం నిరాకార పరమాత్మకు గుర్తుగా గర్భగుడి అవసరంలేని నిరాకార పరమాత్మను ఈశ్వర లింగం గా చుపించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దేవేందర్, లతా, పంచాక్షరీ, లావణ్య, రామరాజు, కవిత, శంకరయ్య, ఉపేందర్, లక్ష్మీనారాయణ, లింగస్వామి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY






## ఆన్లైన్ సెంటర్ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలి

వలిగొండ ఫిబ్రవరి 12 (వార్తా వేదిక సూర్య):




మండల కేంద్రంలోని వెలువర్తి రోడ్డులో గల శ్రీవిద్య ఆన్లైన్ కేంద్రాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పీఎం కిసాన్ సామ్మాన్ నిధి కోసం దరఖాస్తు చేసుకుంటున్న లబ్ధిదారుల నుండి అక్రమంగా ఎనిమిది వందల రూపాయల వరకు వసూలు చేస్తూ లబ్ధిదారులను మోసం చేస్తున్న నిర్వాహకులపై అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఒక పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ ఆన్లైన్ నిర్వాహకుల పట్ల ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమని, అధికారులు లాలూచీ వ్యవహారం మానుకోవాలని కోరారు. దరఖాస్తుదారులు అక్రమ వసూళ్లపై ఆన్లైన్ నిర్వాహకున్ని ప్రశ్నించగా వ్యవసాయ అధికారులకు ఇవ్వాల్సి వస్తుందని ప్రచారం చేస్తున్నాడని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## ఘనంగా మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ తీపిరెడ్డి మేఘూరెడ్డి జన్మదినం

మోత్కూరు ఫిబ్రవరి 12 (వార్త వేదిక సూర్య):

మోత్కూరు మార్కెట్ మాజీ కమిటి చైర్మన్ తీపిరెడ్డి మేఘూరెడ్డి 75వ, జన్మ దినోత్స వాన్ని ఘనంగా బి.ఆర్.ఎస్.నాయకులు, అభిమానులతో శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు.అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తీపిరెడ్డి సావిత్రి



బి.ఆర్.ఎస్. మోత్కూరు, అడ్డగూడూరు మండలాల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్, కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఎస్.సి.ఎస్.టి విజిలెన్ కమిటీ సభ్యులు దాసరి తిరుమలేష్ , నాయకులు మద్రి అనిల్ కుమార్, చతరాశి వెంకన్న చంద్రారెడ్డి, విద్యాసాగర్ కూరేళ్ల ఇంద్ర శేఖర్, బందెల శ్రీను సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాన్ని పరామర్శించిన సీఎన్ రెడ్డి

వలిగొండ ఫిబ్రవరి 12 (వార్తా వేదిక సూర్య):

మండల పరిధిలోని ఆరూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షులు సుంకిశాల పరమేష్ మరియు అతని తండ్రి సుంకిశాల యాదయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బుధవారం వారి దశదినకర్మ కార్యక్రమంలో



ప్రముఖ పారిశ్రామికవేత్త, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిఎన్ రెడ్డి పాల్గొని మృతుల కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జక్కిడి శ్రీనివాస్, పెద్దింటి మల్లికార్జున రెడ్డి, భోగారం రాందాస్, గిరి, బిజెపి గ్రామ శాఖ అధ్యక్షులు ఆవుల బిక్షపతి, సోషల్ మీడియా కన్వీనర్ సింగనబోయిన కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్ స్కూల్ మెనేజ్మెంట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జలంధర్ రెడ్డిని సన్మానించిన డా. ర్యాకల శ్రీనివాస్

యాదాద్రి భువనగిరి జిల్లా,ఫిబ్రవరి 12(వార్తా వేదిక సూర్య)



భువనగిరి చెందిన విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ స్కూల్ చైర్మన్, డా. పగిడాల జలందర్ రెడ్డి ఇటీవల బర్జెట్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా వారిని శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన డా. ర్యాకల శ్రీనివాస్.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడ్జెట్ పాఠశాలల యొక్క సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరారు, భవిష్యత్తు లో మరెన్నో పదవులను పొందాలని కోరుకున్నారు.

## బియన్ తిమ్మాపురం భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి

**- గూడూరు నారాయణ రెడ్డి**

యాదాద్రి భువనగిరి,ఫిబ్రవరి 12(వార్తా వేదిక సూర్య):

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరు నారాయణ రెడ్డి బియన్ తిమ్మాపురం గ్రామ భూ నిర్వాసితులతొ కలిసి ఇండ్ల నష్టపరిహారం విషయంలో బుధవారం అదనపు కలెక్టర్ వీరరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది. గూడూరు నారాయణ రెడ్డి మాట్లాడుతూ అక్కడ ఇండ్లు శిధీలవస్తకు వచ్చి కూలిపోయే స్థితికి వచ్చాయి. ప్రాజెక్టులో నీరు వచ్చి క్రిమి క్రీటకాలు ఇండ్లలోకి వస్తున్నాయి అక్కడి ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బ్రతుకుతున్నారన్నారు.

ఇండ్ల నష్టపరిహారం వచ్చి 3 నెలలు అవుతొంది గ్రామస్తులకు ఎందుకు ఇవ్వట్లేదని ఎందుకు కాలయాపన చేస్తున్నారని అన్నారు. అదనపు కలెక్టర్ స్పందించి గ్రామస్థులకు ఇచ్చే డబ్బులు ఏక్కడ పోలేదని వారికి త్వరలో గ్రామంలో గ్రామ సభ పెట్టి వారి



ఖాతాలలో జమ చేస్తామని హామి ఇచ్చారన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వల్దాస్ రాజ్ కాళభైరవ, వలందాసు గండేయ్య, పిన్నం గణేష్, హరినాథ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## మణికొండ మున్సిపాలిటీలో సమస్యలను పరిష్కరించాలి

### మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ

గండిపేట్, (వార్త వేదిక సూర్య):

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తామని బిఆర్ఎస్పార్టీ మున్సిపల్ అధ్యక్షులు సీతారాం ధూళిపాల అన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ అండ్ కమిషనర్ శ్రీదేవిని కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్టీ నాయకులు కార్యకర్తలతో కలసి శ్రీదేవికి వినతి పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో సుమారు 350 మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వీరి జీతం గత 2023 మే కు ముందు పెరిగాయని గుర్తు చేశారు. పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని వీరి జీతాన్ని రూ.24 వేల వరకు పెంచాలన్నారు. సంవత్సరానికి 15 సాధారణ లీవ్లు ఉన్న వారికి ఆ సదుపాయాన్ని కల్పించడం లేదన్నారు. ఔట్సోర్సింగ్ లో ఉన్న వారందరినీ పర్మినెంట్ చేయాల న్నారు. పిట్టల ఆనంద్ అనే కార్మికుడు చనిపోతే కనీస అవసరాలు తీర్చలేదన్నారు. అతని భార్యకు ఉద్యోగం ఇచ్చినా జీతాలు ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. మణికొండ లో ఉన్న ఇళ్లకు ఆస్తి పనులు పెంచేముందు ఏ రకమైన నోటీసు ఇవ్వకుండా ఎర్లీ బర్డ్ స్కీం ద్వారా పూర్తి



సంవత్సరానికి కట్టిన ఆస్తి పన్నును సగం కు ఆమోదించి మిగతా సగం పక్కనపెట్టి ఆస్తి పన్ను పెంచి ఆపై వడ్డీతో సహా కట్టమని ఒత్తిడి చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.

రోడ్లు వెడల్పు చేసే సమయంలో వీధి వ్యాపారులను దృష్టిలో ఉంచుకొని వారికి మున్సిపాలిటీ షాపులను నిర్మించి ఇవ్వాల న్నారు. ఈ కార్యక్రమంలో కుంభగల ధనరాజ్, గుట్టమీద నరేందర్, పట్లోళ్ల రూపా రెడ్డి, అందే లక్ష్మణరావు, ఉపేంద్ర నాథ్ రెడ్డి, గోరుకంటి విఠల్, సంఘం శ్రీకాంత్, బొడ్డు శ్రీధర్, ఆరిఫ్ మహమ్మద్, సుమనళిని, భానుచందర్, సయ్యద్ రఫీక్, అశ్వక్ అలీ, రవి సాగర్ తదితరులు పాల్గొన్నారు.






## మైలార్దేవ్పల్లి డివిజన్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి ప్రజలు ఇబ్బందులు

**పరిష్కరించాలని డిమాండ్ చేసిన నవ యువ యూత్ క్లబ్ సభ్యులు**

గండిపేట్, (వార్త వేదిక సూర్య):

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ లో ఇటీవల నిర్మించిన రహదారి డ్రైనేజీ మ్యాన్హోల్ మూతలు సరిగా లేకపోవడంతో స్థానికంగా ప్రజలు ప్రమాదాల భారీన పడుతున్నారని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వకుమార స్వామి అన్నారు. సర్కిల్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ లో ఇటీవల నిర్మించిన రహదారి డ్రైనేజీ మ్యాన్హోల్ మూతల సమస్య తీవ్రమైందన్నారు. నూతన సరిగా అమర్చకపోవడంతో నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా యన్నారు. ఈ విషయంపై వాకబు చేయగా అధికారులు పనులు పూర్తికాకుండానే బిల్లు చెల్లించినట్లు తెలిసిం దన్నారు. దీంతో ఏర్వ కుమారస్వామి మాట్లాడుతూ.. కాంట్రాక్టర్కు పనులను అడ్డగోలుగా అప్పజెప్పి బిల్లులను చెల్లించడమేంటని ప్రశ్నించారు. బిల్లులు చెల్లించడంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సాధ్యమైనంత వరకు పనులను పర్యవేక్షించాల్సిన అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా అధికారులు కఠినంగా వ్యవహరించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రేషన్ కార్డుల దరఖాస్తుల సరళిని పరిశీలించిన కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల

సికింద్రాబాద్ ఫిబ్రవరి 12(వార్త వేదిక సూర్య):

సీతాఫాల్మండి లోని మీసేవ కేంద్రంలో జరుగుతున్న రేషన్ కార్డుల దరఖాస్తుల సరళిని బుధవారం స్థానిక కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల పరిశీలించారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మీ సేవ కేంద్రం వారితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డులు గతంలో గానీ, ప్రజాపాలనలో దరఖాస్తు పెట్టుకున్న వారు మళ్లీ అప్లై చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు అలాగే కొత్తగా పెళ్లయిన వారికి నూతన రేషన్ కార్డు కావాలంటే ఇప్పటికే ఉన్న రేషన్ కార్డులో ఉన్న పేరును తొలగిస్తే నూతన రేషన్ కార్డుకు అప్లికేషన్ పెట్టుకోవాలని సూచించారు రేషన్ కార్డు అప్లికేషన్ కొరకు తమ వెంట ఆధార్ కార్డు కరెంట్ బిల్లు తీసుకురావాలని పేర్కొన్నారు అదేవిధంగా ఈ యొక్క అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో పద్మ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, యువకులు మహిళలు పాల్గొన్నారు.



## ఫ్లై ఓవర్, ఆర్ యూబీ పనులు ప్రారంభించాలని సీఎంను కోరిన ఎమ్మెల్యే ప్రకాష్గౌడ్

గండిపేట్, (వార్త వేదిక సూర్య): రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు ప్రకాష్గౌడ్ అన్నారు. బుధవారం సర్కిల్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ మైలార్ దేవ్పల్లి నుంచి దుర్గానగర్ వరకు ఫ్లై ఓవర్ నిర్మాణానికి, అరాంఘర్ దగ్గర రెండు ఆర్ యూబీల నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.259 కోట్లతో మంజూరు చేయడం జరిగిందన్నారు. కానీ వాటిని మంజూరు చేయలేదని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఎమ్మెల్యే సీఎంను కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా రోజురోజుకు ట్రాఫిక్ సమస్య పెరిగిపోయిందన్నారు. సాధ్యమైనంత త్వరగా ఫ్లైఓవర్, ఆర్ యూబి పనులను ప్రారంభించేందుకు నిధులు కేటాయించాలని అన్నారు. ఈ మేరకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు హామీ ఇచ్చినట్లు వివరించారు.

## బీజేఎంసీ 3వ వార్డులో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**- మాజీ కార్పొరేటర్ సంతోషి రాజిరెడ్డి**

గండిపేట్, (వార్త వేదిక సూర్య) :

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3 వ వార్డులో నీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జలమండలి జీఎం మహేందర్ నాయక్ ను స్థానిక మాజీ కార్పొరేటర్ సంతోషి రాజి రెడ్డిని కోరారు. ఈ



మేరకు జీఎం, మేనేజర్ శ్రీనివాస్ లకు సమస్యను వివరించారు. బుధవారం వారు మూడవ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని మంచినీటిని సరఫరా చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ సంతోషి రాజి రెడ్డి అధికారులను కోరారు.






## మార్చి 2 నుంచి దాసరినెమిలిపూర్ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

**శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి 38వ బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**

దేవరకొండ ఫిబ్రవరి 12 న్యూస్(వార్తా వేదిక సూర్య): మార్చి 2 నుంచి 6 వరకు దాసరినెమిలిపూర్ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్స వాలను నిర్వహించనున్నట్లు బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ తెలిపారు.బుధవారం డిండి మండలం దాసరినెమిలిపూర్ గ్రామంలో నిర్వహించే శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి 38వ బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను మాజీ శాసన సభ్యులు రవీంద్ర కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు శ్రీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహం పొందాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామచంద్రం, గంగిడి నరేందర్ రెడ్డి, గంగిడి కొండల్ రెడ్డి, పసునూరి వెంకటయ్య,తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కార్డియాలజీ మెడికల్ క్యాంపు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 12(వార్తా వేదిక సూర్య): భారత ఆహార సంస్థ నల్గొండ జిల్లా కార్యాలయంలో హైదరాబాద్ యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కార్డియాలజీ మెడికల్ క్యాంపు నిర్వహించారు.ఈ కార్యక్రమం లో సంస్థ నల్గొండ డివిజనల్ మేనేజర్ సువీణ్ కుమార్ ముఖ్య అతిథి గా



పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఉద్యోగులు ఆరోగ్యం పట్ల తగు శ్రద్ధ వహించాలని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ కార్డియాలజీ కన్సల్టెంట్ మరియు యశోద హాస్పిటల్స్ వైద్యులు డా. గురురాజ్ ప్రమోద్, ఆసుపత్రి మేనేజర్ వినయ్ ఎఫ్ సి ఐ సిబ్బంది ప్రసాద్, కెకె షా, బిల్లా శ్రీనివాస రావు మరియు నిర్వాహకులు సతీష్ రెడ్డి పాల్గొన్నారు.



## తొండల్‌వాయి ఎస్‌సి సెల్ నూతన కమిటీ ఎన్నిక

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 12(వార్తా వేదిక సూర్య): నల్లగొండ జిల్లా ఎస్ సి సెల్ చైర్మన్ బోడ స్వామి నార్కెట్ పల్లి మండల ఉపాధ్యక్షులు చింత విజయకుమార్ ఆధ్వర్యంలో తొండల్ వాయి కాంగ్రెస్ పార్టీ ఎస్ సి సెల్ నూతన కమిటీ ని ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీ.ఎస్ సి సెల్ తొండలవాయి. కమిటీ. అధ్యక్షులు.చింత సైదులు పాల్. ఉపాధ్యక్షులు. చింత స్వామి. ని ఎన్నుకున్నారు.. ఈ కార్యక్రమంలో . చింత శివ శంకర్ చింత సునీల్.మేడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.





శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి దర్శించుకున్న బిఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్

# వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించాలి

**పెండింగ్ క్లెయిమ్స్‌ను వెంటనే పరిష్కరించాలి**

**రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వంగూరి రాములు.**

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 12(వార్తా వేదిక సూర్య)



భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ బోర్డును వెంటనే నియమించాలని, బోర్డు స్కీం లను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పవద్దని బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు కార్మికులకు అమలు చేయాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వంగూరి రాములలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) నల్గొండ జిల్లా విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షుడు కంచి కేశవులు అధ్యక్షతన దొడ్డి కొమరయ్య భవన్ లో జరిగింది.సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డును నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలవుతున్న ప్రమాద బీమా,సహజ మరణం,శాశ్వత పాక్షిక అంగవైకల్యం తదితర సంక్షేమ పథకాలను భీమా కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పజెప్పాలని ఆలోచన చేస్తుందని అన్ని యూనియన్లు కొద్దిగా వెనకకు తగ్గిన పూర్తిగా విరమించుకోకపోతే కార్మిక వర్గ ఆగ్రహానికి ప్రభుత్వం గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

వెల్ఫేర్ బోర్డు సైట్ అందుబాటులోకి వచ్చిన ఇంకా క్లెయిమ్స్ పరిష్కారం కాకుండా ఉండిపోయాయని వీటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కార్మికులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రెట్టింపు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘాలు పోరాడుతుంటే ఉన్న వెల్ఫేర్ బోర్డు నే నిర్వీర్యం చేయాలని ప్రభుత్వం చూస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వెల్ఫేర్ బోర్డులో 5600 కోట్ల రూపాయలు నిధులు ఉన్నాయని వాటిని కార్మికుల సంక్షేమాన్ని కాకుండా ఇష్టం వచ్చినట్లుగా దుబారా ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీ అనుమతి లేకుండా బోర్డు నిధులు ఖర్చు చేయరాదని నిబంధన ఉన్న పాటించడం లేదని ఆరోపించారు. బోర్డు ద్వారా అమలవుతున్న ఈ పథకాలను బీమా కంపెనీలకు అప్పచెప్పితే బోర్డు భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని సెస్సునిధులు వసూలు చేయరని దీనివలన బీమా కంపెనీల అధికారులకు ఏజెంట్లకు కమీషన్స్ తప్ప కార్మికులకు ఏ రకమైన ప్రయోజనం ఉండదని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా నాయకులు అద్దంకి నరసింహ, ఎస్ కె బషీర్, పోలే సత్యనారాయణ,బి దయానంద్, వరికుప్పల ముత్యాలు, అవుట రవీందర్ , ఎస్ సైదాచారి, కత్తుల శంకర్, బివెంకటయ్య యాదయ్య, వెంకట్ రాములు, చిరంజీవి,ఎస్.కె హుస్సేన్, వెంకట్రావు, మల్లేష్ చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.





## ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిక

దేవరకొండ ఫిబ్రవరి 12(వార్తావేదికసూర్య): దేవరకొండ నియోజక వర్గం దేవరకొండ మండల పరిధిలోని కమలాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సినియర్ నాయకులు అనుపటి లక్ష్మయ్య, నర్ర వెంకటయ్య, మాచర్ల శ్రీనివాస్,నర్ర శోభన్ బాబు గారితో పాటు 20 మంది బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీని విడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న సందర్భంగా వారిని కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించిన దేవర కొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్.. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కామల్ల వెంకటయ్య గౌడ్,మాజీ ఎంపిటిసి మల్లేపల్లి జీవన్ రెడ్డి,లీల రవికాంత్ రెడ్డి, టిపిసిసి మీడియా అండ్ కమ్యూనికేషన్ జిల్లా కన్వీనర్ నర్ర బాలు,మాజీ సర్పంచులు సత్యం,నరీయా నాయక్, కొర్ర శంకర్,మాజి ఎంపీటీసీ బిక్కు నాయక్,మాజీ ఉపసర్పంచ్ రేపని పద్మ యాదయ్య, సివర్ల మధు యాదవ్,కోటి యాదవ్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దుబ్బ చరణ్ ,నల్లగాసు నర్సింహా,వుల్లంకొండ కృష్ణ, రేపని శ్రీను, నర్రా కిషోర్, నల్లగాసు వినోదు,నర్ర విశ్వేశ్వర్, జాజాల ప్రశాంత్, కోట్ర శ్రీను,నల్ల పెద్దయ్య, గండికోట ప్రసాద్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.







## కేజీబీవీ విద్యార్థినులు పదవ తరగతిలో పదికి పది జిపిఏ మార్కులు సాధించాలి : జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 12(వార్తా వేదిక సూర్య): కేజీబీవీ విద్యార్థినులు పదవ తరగతిలో పదికి పది జిపిఏ మార్కులు సాధించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం ఆమె నల్గొండ జిల్లా, కనగల్ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలతో ముఖాముఖి మాట్లాడరు. వారితో సెల్ఫీ దిగిన అనంతరం మాట్లాడుతూ పదవ తరగతిలో ఎక్కువ జిపిఏ మార్కులు ప్రత్యేకించి 10-10 జిపిఏ సాధించిన వారిని విజయవాడ, చెన్నై లాంటి పట్టణాలకు విమానంలో తీసుకువెళ్తానని వారిని ప్రోత్సహించడమే కాకుండా వారికి రాతపూర్వకంగా రాసి ఇచ్చారు.

అందువల్ల తరగతిలోని విద్యార్థినులందరూ 10కి 10 జిపిఏ వచ్చే విధంగా బాగా చదవాలని ఆమె విద్యార్థులను ప్రోత్సహించారు. భవిష్యత్తులో మంచి కళాశాలలో ర్యాంకులు రావాలంటే ఎన్ సి ఈఆర్టీ పుస్తకాలు చదవాలని ఆమె సూచించారు.

ముఖ్యంగా 8, 9, 10 తరగతి విద్యార్థినిలు ఇప్పటినుండే ఎన్సీఈఆర్టీ పుస్తకాలను ప్రాక్టీస్ చేయాలన్నారు. అవసరమైతే 9, 10 తరగతుల పుస్తకాలను తక్షణమే పాఠశాలకు పంపించడం జరుగుతుందని ఆమె తెలిపారు. చదువువల్లనే అన్ని సాధించడం జరుగుతుందని, అందువల్ల చదువు పైన ఎక్కువ దృష్టి సారించి జీవితంలో మంచి స్థానంలో స్థిరపడాలని ఆమె సూచించారు.

## పట్టణాలు, మండల కేంద్రాలలో మోడల్ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, ఫిబ్రవరి 12(వార్తా వేదిక సూర్య) ప్రజలలో అవగాహన కల్పించేందుకుగాను ముఖ్యమైన



పట్టణాలు, మండల కేంద్రాలలో మోడల్ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.

బుధవారం ఆమె నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవ రణలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కలెక్టరేట్లో నిర్మించిన ఇందిరమ్మ



మోడల్ ఇల్లు బాగుందని, ఇదేవిధంగా నల్గొండ జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, ముఖ్యమైన పట్టణాలలో ప్రజలకు అవగాహన కల్పించేందుకుగాను ఇలాంటి మోడల్ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని చెప్పారు .రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలలో ఇందిరమ్మ ఇండ్లు కూడా ఒకటి. జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్ కుమార్ ,సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ లు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దుబ్బ రూప

నల్లగొండ టౌన్, (వార్తా వేదిక సూర్య) నల్లగొండ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకురాలు దుబ్బ రూప మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా నియమితులయ్యారు. మహిళా కాంగ్రెస్ ఆల్ ఇండియా అధ్యక్షురాలు ఆల్కలాంబ సూచన మేరకు కాంగ్రెస్ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు సునీతా రావు దుబ్బ రూపకు బుధవారం ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగారాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైనా దుబ్బరూప మాట్లాడుతూనా ఎన్నికకు సహకరించిన రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి,రాష్ట్ర, జిల్లా, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిదంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, ప్రజలలో ప్రచారం నిర్వహించి, పార్టీ బలోపేతం కోసం, మహిళలను పార్టీ ప్రతిష్టతకు కృషి చేస్తానని తెలిపారు.



## కొత్త ఉద్యాన పంటలు పండించేందుకు కొత్త పంటలపై అధ్యయనం చేయాలి

**- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

నల్లగొండ, ఫిబ్రవరి 12(వార్తా వేదిక సూర్య): నల్గొండ జిల్లాలో కొత్త ఉద్యాన పంటలను ప్రోత్సహించే విధంగా ఉద్యాన శాఖ అధికారులు పరిశోధన కార్యక్రమాలను కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.

బుధవారం ఆమె నల్గొండ జిల్లా, కొండమల్లేపల్లి లో ఉన్న ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు.

పరిశోధన కేంద్రం ద్వారా ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ బత్తాయి, నిమ్మ పంటలపై పరిశోధనలతో పాటు మేలైన మొక్కలను తయారు చేసి రైతులకు అందజేస్తున్నారు. జిల్లాలో 43000 ఎకరాలలో బత్తాయి, తొమ్మిది వేల ఎకరాలలో నిమ్మ తోటలు పంటలు పండిస్తుండగా, వీటి ద్వారా ఇంకా మెరుగైన దిగుబడులు వచ్చేలా రైతులకు మంచి మొక్కలను తయారు చేసే విధంగా పరిశోధన కొనసాగించాలని అన్నారు.రాళ్లు, రప్పలు ఉన్న భూములలో కుంకుడు పంటను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. అంతేగాక నల్గొండ జిల్లాలో కొత్త ఉద్యాన పంటలు పండించేందుకు కొత్త పంటలపై అధ్యయనం చేయాలని సూచించారు. ఇందుకు కొండ లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం సహకారం తీసుకోవాలని చెప్పారు . జిల్లాలో తాటి, ఈత చెట్లను పెంచే విధంగా చూడాలని అన్నారు. అలాగే కొండమల్లేపల్లి ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని మరింత తీర్చిదిద్దాలని సూచించారు. కాగా పరిశోధన కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, నీటి కొరత ఉందని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. ఉద్యాన పరిశోధన కేంద్రంలో ఉద్యాన నర్సరీ పెంచేందుకుగాను 25 లక్షల రూపాయలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇన్పుట్ డీలర్లకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి వారితో మాట్లాడారు.

జిల్లా ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు సాయిబాబా, సీనియర్ సైంటిస్టు రాజు గౌడ్, ట్రైనింగ్ కోఆర్డినేటర్ లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY







## అన్ని వర్గాలకు ప్రయోజనం
# చేకూరేలా కేంద్ర బడ్జెట్

**- బిజెపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి**

**నల్గొండ బ్యూరో, ఫిబ్రవరి 12(వార్తా వేదిక సూర్య):** కేంద్రంలోని ఎన్డీఏ నేతృత్వంలోని మోడీ ప్రభుత్వం ఆత్మనిర్భర భారత్ నిర్మాణమే లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరేలా బడ్జెట్ ఉందని బిజెపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం నల్గొండ లోని బిజెపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ఉత్పత్తిని పెంపొందించడానికి మధ్యతరగతి ఎగువ మధ్యతరగతి వారికి పన్ను ఆదా ప్రకటించిందన్నారు.వీధి వ్యాపారాస్తుల నుంచి మొదలుకొని రైతులు పారిశ్రామికవేత్తల వరకు అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరే విధంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టారని తెలిపారు.సబ్ కే సాత్ సబ్ కా వికాస్ లో భాగంగా పేదలను శక్తివంతం చేయడం అన్నదాత ఉత్పాదక సామర్థ్యాలను పెంచేలా కేంద్రం నిర్ణయం తీసుకుందని తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు రు.1.5 లక్షల కోట్ల బడ్జెట్,కోటిమంది పట్టణ పేద మధ్యతరగతి కుటుంబాల గృహ అవసరాలను తీర్చడానికి 10 లక్షల కోట్ల పెట్టుబడిని కేంద్ర బడ్జెట్లో ప్రతిపాదించిందన్నారు.మహిళలు, బాలికల లబ్ధి చేకూరి విధంగా రూ 3 లక్షల కోట్ల మేర కేటాయించినట్లు తెలిపారు. పన్ను చెల్లింపుదారులకు ఉపశమనం కల్పించేలా బడ్జెట్లో ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు.అన్ని వర్గాలకు రైతు సంక్షేమం,మధ్యతరగతికి ఉపశమనం, మహిళలకు యువతకు సాధికారిక కల్పించడం వరకు వికసిత్ భారత్ లక్ష్యంగా తీసుకొని ప్రవేశపెట్టినటువంటి బడ్జెట్ అన్ని రంగాలలో నూరు శాతం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళ్తుందని హర్షం వ్యక్తం చేశారు.

## చండూర్‌లో విద్యుత్ కార్మికుల
# ప్లాటినం జూబ్లీ వేడుకలు

**చండూర్, ఫిబ్రవరి 12(వార్తా వేదిక సూర్య):**
చండూరు విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో 1104 యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా ప్లాటినం జూబ్లీ వేడుకలు జరిగినాయి. యూనియన్ పిలుపుమేరకు,చండూరు




విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో చండూరు 1104 యూనియన్ మండల అధ్యక్షుడు యం.డి.షజ్జు పాష 1104 యూనియన్ జెండా ను ఆవిష్కరించినారు. ఈ సందర్భంగా నల్లగొండ డివిజన్ కోశాధికారి యం.డి.షరీఫ్ పాష కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడే ఏకైక యూనియన్ 1104అన్నారు. విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు యూనియన్ అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి విద్యుత్ సంస్థ లో కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయించిందన్నారు.కార్మిక సంక్షేమం కొరకు నిరంతరం పాటుపడి ఎందరో కార్మికుల జీవితాలలో యూనియన్ వెలుగు నింపిందన్నారు. అలాంటి ఘన చరిత్ర కలిగిన యూనియన్ 74 వ వసంతం పూర్తి చేసుకొని 75 వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఈ ప్లాటినం జూబ్లీ వేడుకలు జరుపుకున్నామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఎల్లేషం,ముత్యంరెడ్డి,చంద్రమౌళి, వెంకన్న,గోవర్ధన్,సురేష్ రెడ్డి,సైదులు, హరిలాల్,పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సేవకు స్వదేశీ భూషణ్ అవార్డ్

**ఎస్ బి సాగర్ ప్రజాపతి స్వదేశీ సంస్థాన్ ఇండియా వ్యవస్థాపకులు**

**హైదారాబాద్, ఫిబ్రవరి 12(వార్తా వేదిక సూర్య):** ప్రముఖ రచయిత, విశిష్ట సాహిత్య వేత్త జామి ప్రసాదరావు హిందీ బోధన ఉపాధ్యాయులుగా సేవలు అందిస్తూనే హిందీలో రచించబడిన అనేక రచనలకు గుర్తింపుగా అదేవిధంగా, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ లకావత్ సిల్మా నాయక్ ఉపాధ్యాయ వృత్తి తో పాటు సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ప్రధాన సలహాదారుగా వ్యవహరిస్తూ పర్యావరణ పరిరక్షణ జల సంరక్షణ సహజ వనరుల సంరక్షణ ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటూ వారు చేస్తున్న కృషికి గాను




అదేవిధంగా సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ పర్యావరణ మిత్ర, సేవరత్న, విశ్వ గురు వరల్డ్ రికార్డ్స్ ఇండియన్ ఐకాన్ తదితర అవార్డ్స్ గ్రహీత డాక్టర్ టి సురేందర్ నిర్వహిస్తున్న సమాజ సేవలకు గుర్తింపుగా స్వదేశీ భూషణ్ అవార్డు 2025 కు ఎంపిక కావడం హర్షణీయం అన్నారు. ఈ సందర్భంగా వారికి ఉత్తరప్రదేశ్ లోని పవిత్ర భూక్షేత్ర ప్రాంతం అయోధ్యలో ఏప్రిల్ ఒకటి నుండి 5వ తారీఖు వరకు జరిగే అంతర్జాతీయ సదస్సులో ఈ స్వదేశీ భూషణ్ 2025 అంతర్జాతీయ అవార్డును తెలంగాణ రాష్ట్రానికి చెందిన జామి ప్రసాదరావు కు, డాక్టర్ లకావత్ సిల్మా నాయక్ కు, డాక్టర్ టి సురేందర్ కు అందజేయనున్నట్లు స్వదేశీ సంస్థాన్ ఇండియా వ్యవస్థాపకులు ఎస్ బి సాగర్ ప్రజాపతి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారికి వారి శ్రేయోభిలాషులు, బంధుమిత్రులు, ప్రముఖులు, సహ ఉద్యోగులు, సేవకులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభినందనలు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.









# క్రమశిక్షణ.. ఏకాగ్రతతోనే ఉన్నత శిఖరాలు

- **సాంకేతిక విజ్ఞానం కత్తితో సమానం**
- **కృష్ణవేణి హై స్కూల్ 17వ వార్షికోత్సవ వేడుకలు**
- **ప్రొఫెసర్ వడ్డనం శ్రీనివాస్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ఎంఈవో గురవారావు,**

**చౌటుప్పల్,ఫిబ్రవరి 12(వార్తా వేదిక సూర్య)**
పట్టుదల.. క్రమశిక్షణ.. ఏకాగ్రతలతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యమవుతుందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వడ్డనం శ్రీనివాస్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ఎంఈవో




గురవారావులు అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డులోని ఎస్ఎం రెడ్డి ఫంక్షన్ హాల్ లో కృష్ణవేణి హై స్కూల్ 17వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వడ్డనం శ్రీనివాస్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ఎంఈవో గురవారావులు హాజరయ్యారు.

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వడ్డనం శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉన్నతంగా ఆలోచించాలని సూచించారు. పట్టుదల, క్రమశిక్షణతో పాటు సమయ పాలనతో కూడిన విద్య అవసరమన్నారు. పుస్తక జ్ఞానంతో పాటు జీవన నైపుణ్యాలను నేర్చుకోవాలన్నారు. సమాజంలో పిల్లల నడవడికలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. ఇప్పుడు సమయాన్ని వృధా చేస్తే భవిష్యత్తులో బాధపడాల్సి వస్తుందన్నారు.

### సాంకేతిక విజ్ఞానం కత్తితో సమానం

**- టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ**

సాంకేతిక విజ్ఞానం కత్తితో సమానమన్నారు. కత్తి రెండు స్వభావాలు కలిగి ఉంటుందని, వైద్యుని చేతిలో కత్తి ఉంటే ప్రాణం పోస్తుందని, రౌడీ చేతిలో ఉంటే ప్రాణం తీస్తుందన్నారు. పిల్లలు సెల్ ఫోన్ వాడుతున్న విధానాన్ని చూసి మురిసిపోకండని తల్లిదండ్రులను హెచ్చరించారు. అందులో మంచి చూస్తున్నారా, చెడు చూస్తున్నారా గమనించాల్సిన విషయం తల్లిదండ్రుల పైన




ఉందన్నారు. పిల్లలు ఏడిస్తే తల్లిదండ్రులే స్వయంగా మొబైల్ ను పిల్లలకు చేతులకు ఇస్తున్నారు. దీంతో పిల్లలు మొబైల్ చూస్తేనే తింటున్నారు, పడుకుంటున్నారన్నారు.

చిన్నతనం నుంచే పిల్లలకు సమయపాలన బోధపడేలా చేయాలని సూచించారు. తల్లిదండ్రులే సినిమాలు, సీరియల్ ఉంటూ వాటికి అతుక్కుపోతుంటే, పిల్లలు మాత్రం వాళ్లను అనుకరించకుండా పోతారా అని హెచ్చరించారు. పిల్లల ముందే తల్లిదండ్రులు గొడవపడితే వాళ్ళ మనస్తత్వం మారే అవకాశం ఉందని, పిల్లలు తప్పు దోవ పట్టే అవకాశం లేకపోలేదన్నారు. పిల్లల ముందు తల్లిదండ్రులు గౌరవం కాపాడుకోవాలనన్నారు.

### సమాజంలో ఉత్తమునిలా ఎదగాలి

**- మండల విద్యాధికారి గురవారావు**

డిగ్రీ వస్తే సమాజం విద్యావంతుడనిగా గుర్తిస్తుందని, సంస్కారవంతునిగా మెలిగితేనే సమాజంలో ఉత్తముడిగా



ఎదుగుతావని మండల విద్యాధికారి గురవారావు అన్నారు. కార్యాచరణ, ప్రణాళికతోనే నిర్దిష్ట లక్ష్యాన్ని చేరుకోవచ్చున్నారు. నీకు ఇష్టమైన లక్ష్యంతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యమవుతుందన్నారు. అనంతరం చిన్నారులు, విద్యార్థులు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. చిన్నారుల నృత్యాలకు తల్లిదండ్రులు మురిసిపోయారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి హై స్కూల్ చైర్మన్ గుత్త గోపాల్ రెడ్డి, కరస్పాండెంట్ కవిత, ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు సన్మానం

**గండిపేట్, (వార్త వేదిక సూర్య) :**
నార్సింగి మున్సిపాలిటీ మున్సిపల్ చైర్మన్‌గా మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా గోపాల విజయబాబులు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కోకాపేట్ ప్రభుత్వ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు అలివేలు అన్నారు. బుధవారం నార్సింగి మున్సిపాలిటీ కోకాపేట్ గవర్నమెంట్ స్కూల్లో మున్సిపల్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో బాల్వంత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, టీచర్స్ బృందం, కౌన్సిలర్లు గంగిరి శివారెడ్డి, అరికె దుర్గేష్ యాదవ్, నాగేష్, ఎస్‌వీఎస్ యూత్ సభ్యులు మల్లా రెడ్డి, శాంతిరెడ్డి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.







# భారత్ క్లీన్ స్వీప్




ఇంగ్లండ్‌తో బుధవారం జరిగిన మూడో, చివరి వన్డేలో ఆతిథ్య టీమిండియా 142 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 30తో క్లీన్ స్వీప్ చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా 50 ఓవర్లలో 356 పరుగులకు ఆలౌటైంది. తర్వాత లక్షఛేదనకు దిగిన ఇంగ్లండ్ 34.2 ఓవర్లలో 214 పరుగులకే కుప్పకూలింది. క్లిష్టమైన లక్షంతో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్‌కు ఓపెనర్లు బెన్ డకెట్, ఫిలిప్ సాల్ట్ మెరుపు ఆరంభాన్ని అందించారు. డకెట్ దూకుడైన బ్యాటింగ్‌తో అలరించాడు. వరుస ఫోర్లతో భారత బౌలర్లను హడలెత్తించాడు. అయితే 22 బంతుల్లో 8 ఫోర్లతో 34 పరుగులు చేసి డకెట్‌ను అర్ష్‌దీప్ వెనక్కి పంపాడు.

ఆ తర్వాత ఇంగ్లండ్ మళ్లీ కోలుకోలేక పోయింది. భారత బౌలర్లు సమష్టిగా రాణిస్తూ ప్రత్యర్థి టీమ్ బ్యాటింగ్ పతనాన్ని శాసించారు. ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ 4 ఫోర్లతో 23 పరుగులు చేసి ఔటయ్యాడు. వన్‌డౌన్‌లో ఇచ్చిన టామ్ బన్‌టన్ 4 ఫోర్లు, రెండు సిక్స్‌లతో 38 పరుగులు సాధించాడు. జో రూట్ (24), హ్యారీ బ్రూక్ (19) పరుగులు చేశారు. చివర్లో గుస్ అట్కిన్సన్ 19 బంతుల్లోనే ఆరు ఫోర్లు, ఒక సిక్సర్‌తో అజేయంగా 38 పరుగులు సాధించాడు. కెప్టెన్ జోస్ బట్లర్ (6), లియమ్ లివింగ్‌స్టోన్ (9), ఆదిల్ రషీద్ (0), మార్క్‌వుడ్ (9) నిరాశ పరిచారు. టీమిండియా బౌలర్లలో అర్ష్‌దీప్, హర్షిత్ రాణా, అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్య రెండేసి వికెట్లను పడగొట్టారు.




### ఆదుకున్న గిల్, కోహ్లి

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియాకు ఆరంభంలోనే షాక్ తగిలింది. కిందటి వన్డేలో సెంచరీతో అలరించిన కెప్టెన్ రోహిత్ శర్మ ఈసారి నిరాశ పరిచాడు. రెండు పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. అయితే వన్‌డౌన్‌లో వచ్చిన సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లితో కలిసి మరో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ ఇన్నింగ్స్‌ను కుదుట పరిచాడు. ఇద్దరు ఇంగ్లండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ స్కోరును ముందుకు నడిపించారు. ఇటు కోహ్లి, అటు గిల్ సమన్వయంతో ఆడడంతో భారత్ కోలుకుంది. ఈ జోడీని విడగొట్టేందుకు ప్రత్యర్థి జట్టు బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అద్భుత బ్యాటింగ్‌ను కనబరిచిన కోహ్లి, గిల్‌లు రెండో వికెట్‌కు వందకు పైగా పరుగులు జోడించారు. అయితే 55 బంతుల్లో ఏడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 52 పరుగులు చేసిన కోహ్లిని ఆదిల్ రషీద్ వెనక్కి పంపాడు.

### శ్రేయస్ జోరు..

తర్వాత వచ్చిన శ్రేయస్ అయ్యర్‌తో కలిసి గిల్ మరో కీలక పార్ట్‌నర్‌షిప్‌ను నమోదు చేశాడు. ఇద్దరు దూకుడుగా ఆడుతూ స్కోరును పరిగెత్తించారు. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే చెత్త బంతులను ఫోర్లు, సిక్సర్లుగా మలుస్తూ ముందుకు సాగారు. ఇదే క్రమంలో మూడో వికెట్ 104 పరుగులు కూడా జోడించారు. చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన శుభ్‌మన్ గిల్ 102 బంతుల్లోనే 14 ఫోర్లు, 3 సిక్సర్లతో 112 పరుగులు చేశాడు. ఇక విధ్వంసక బ్యాటింగ్‌తో అలరించిన శ్రేయస్ అయ్యర్ 64 బంతుల్లోనే 8 ఫోర్లు, రెండు సిక్స్‌లతో 78 పరుగులు సాధించాడు. కెఎల్ రాహుల్ కూడా మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఇంగ్లండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న రాహుల్ 29 బంతుల్లోనే 40 పరుగులు చేశాడు. దీంతో భారత్ మెరుగైన స్కోరును నమోదు చేసింది. ఇంగ్లండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్ నాలుగు, మార్క్‌వుడ్ రెండు వికెట్లు పడగొట్టారు.

### గిల్ అరుదైన రికార్డు

టీమిండియా యువ సంచలనం, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన మూడో వన్డే సందర్భంగా గిల్ ఈ ఫీట్‌ను సాధించాడు. వన్డేల్లో అత్యంత వేగంగా 2500 పరుగులు సాధించిన బ్యాటర్‌గా గిల్ రికార్డు సృష్టించాడు. గిల్ 50 ఇన్నింగ్స్‌లలోనే 2500 పరుగులు సాధించాడు. ఈ క్రమంలో గతంలో సౌతాఫ్రికా క్రికెటర్ హషీం ఆమ్లా పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టారు. ఆమ్లా 59 ఇన్నింగ్స్‌లలో 2500 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. కానీ గిల్ ఈ ఘనత 50 ఇన్నింగ్స్‌లలోనే సాధించడం విశేషం.




## ఫిబ్రవరి 14న 'బ్రహ్మా ఆనందం'తో

# పుత్రోత్సాహం కలగాలి- మెగాస్టార్

మళ్ళీ రావా, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, మసూద వంటి హ్యాట్రిక్ హిట్ల తరువాత స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి 'బ్రహ్మా ఆనందం' అనే చిత్రం రాబోతోంది. ఈ చిత్రంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత బ్రహ్మానందం, అతని కుమారుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రలు పోషించారు. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హోలక్కల్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. శ్రీమతి సావిత్రి,శ్రీ ఉమేష్ కుమార్ సమర్పణలో రూపొందించిన ఈ చిత్రాన్ని నూతన దర్శకుడు ఆర్.వి.ఎస్ నిఖిల్ అద్భుతంగా తెరకెక్కించారు. విజయవంతమైన నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా ఈ సినిమాను భారీ ఎత్తున నిర్మించారు. ఈ చిత్రం ఫిబ్రవరి 14న రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో మంగళవారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. నాగ్ అశ్విన్, అనిల్ రావిపూడి వంటి దర్శకులు ఈ కార్యక్రమంలో సందడి చేశారు. ఈవెంట్‌లో.. చిరంజీవి మాట్లాడుతూ .. 'సినిమాను తీయడం ఎంత ముఖ్యం.. మంచి టైంకి రిలీజ్ చేయడం, ప్రమోట్ చేయడం చాలా ముఖ్యం. ఈ మధ్య కాలంలో అనిల్ రావిపూడి సంక్రాంతికి వస్తున్నాం సినిమాను చక్కగా ప్రమోట్ చేశాడు. రాజా రవీంద్ర ఈ బ్రహ్మా ఆనందం సినిమా గురించి చెప్పాడు. హీరోలు దొరకడం లేదు.. ప్రమోషన్స్ కాస్త డల్‌గా ఉన్నాయ్ అని చెప్పాడు. నేను వస్తాను అని వెంటనే బ్రహ్మానందంకు ఫోన్ చేసి చెప్పాను. ప్రతీ దానికి, ప్రతీ చోటా చిరంజీవి కనిపిస్తున్నాడని అంతా అనుకున్నా సరే. నాకున్న ఇమేజ్, గుడ్ విల్ వాడి ఇతర సినిమాల్ని ప్రమోట్ చేస్తాను. నా మిత్రుడు బ్రహ్మానందం గురించి అయితే నేను కచ్చితంగా వస్తాను. చంటబ్బాయ్ పాట షూటింగ్‌లో నేను బిజీగా ఉన్నప్పుడు.. ఓ వ్యక్తి విజిల్స్ వేస్తూ నానా హంగామా చేశాడు. అత్తిలి లెక్చరర్ అండి అని జంధ్యాల చెప్పారు. వెంటనే అతడ్ని పిలిచి మాట్లాడాను. మిమిక్రీ కూడా చేస్తాడని తెలిసి సాయంత్రం రమ్మని అన్నాను. అలా ప్రతీ రోజూ సాయంత్రం వచ్చేవాడు. రన్నింగ్ కారెక్టర్ అని జంధ్యాల బ్రహ్మానందంకి పాత్ర ఇచ్చి చాలా ఏడ్పించాడు. అలా మా స్నేహం మొదలైంది. ఇంత టాలెంట్ ఉన్న ఈ వ్యక్తి ఇక్కడే ఉండిపోకూడదని అనుకున్నాను. మద్రాస్‌కు తీసుకెళ్తే ఈ టాలెంట్‌ను అందరూ వాడుకుంటారు అని అనుకున్నాను. బ్రహ్మానందంను ఇంటికి తీసుకెళ్తే నా తమ్ముళ్లు వింతగా చూశారు. నాతో పాటు బ్రహ్మానందంను ప్రతీ చోటకు తీసుకెళ్లేవాడ్ని. బ్రహ్మానందుకు నేను అంబాసిడర్, ఏజెంట్‌ను అయి ప్రమోట్ చేశాను. అలా మొదలైన బ్రహ్మానందం ప్రయాణం నేటికి ఏ స్థాయికి వెళ్లిందో అందరికీ తెలిసిందే. బ్రహ్మానందం తన కొడుకుతో కలిసి చేసిన ఈ బ్రహ్మా ఆనందం మూవీని అందరూ ఆదరించాలి. ఈ మూవీని తీసిన నిఖిల్, నిర్మాత రాహుల్‌కు ఆల్ ది బెస్ట్. రఘు బాబు, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల వంటి వారు నటించడంతో పరిపూర్ణత చేకూరినట్టు అయింది. ప్రియ, ఐశ్వర్య, దివిజలకు ఆల్ ది బెస్ట్. ఇలాంటి చిత్రాలను ఆదరించండి. ఇలాంటి వేడుకకు నన్ను పిలిచిన నా సోల్ మేట్ బ్రహ్మానందంకు థాంక్స్. ఫిబ్రవరి 14న ఈ చిత్రం పెద్ద హిట్ అవుతుంది. నీకు (బ్రహ్మానందం) పుత్రోత్సాహం కలుగుతుంది. నేను ఎలాగైతే పుత్రోత్సాహాన్ని పొందుతున్నానో.. నువ్వు (బ్రహ్మానందం) కూడా అంతే పుత్రోత్సాహాన్ని పొందుతావు' అని అన్నారు.

## 'తండేల్' సక్సెస్ చూస్తుంటే ఎంతో ఆనందంగా వుంది - అక్కినేని నాగార్జున

యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య, సాయి పల్లవి మ్యూజికల్ బ్లాక్ బస్టర్ 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వంలో మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో గీతాఆర్ట్స్ బ్యానర్‌పై ఫ్యాషనేట్ ప్రొడ్యూసర్ బన్నీవాసు ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. భారీ అంచనాలతో ఫిబ్రవరి 7న ప్రపంచ వ్యాప్తంగా విడుదలై ఈ చిత్రం అన్ని చోట్ల దుల్లగొట్టే రెస్పాన్స్ తో బ్లాక్ బస్టర్ సక్సెస్ ని సొంతం చేసుకుంది. ప్రేక్షకులు, అభిమానులు, విమర్శకులు సినిమాపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించిన 'తండేల్' హౌస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా టీం 'తండేల్' లవ్ సునామీ సెలబ్రేషన్స్ ని గ్రాండ్ గా నిర్వహించారు. కింగ్ అక్కినేని నాగార్జున ఈ వేడుక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిర్మాత అశ్వినీదత్ స్పెషల్ గెస్ట్ గా పాల్గొన్నారు. ఈ వేడుకలో నాగచైతన్య, శోభితా దంపతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 'తండేల్' లవ్ సునామీ సెలబ్రేషన్స్ లో కింగ్ అక్కినేని నాగార్జున మాట్లాడుతూ.. సక్సెస్ మీట్ కి వచ్చి చాలా రోజులౌతుంది. చాలా సంతోషంగా వుంది.



అరవింద్ కథ విని చందూ మొండేటితో తీద్దామన్నా వేళావిశేషం, దేవిశ్రీ మ్యూజిక్, బన్నీవాసు టీంని సెట్ చేసిన వేళా విశేషం, నాగచైతన్య శోభితని పెళ్లి చేసుకున్న వేళావిశేషం.. ఇవన్నీ బావున్నాయి. 'తండేల్' సక్సెస్ చూస్తుంటే ఎంతో ఆనందంగా వుంది. ఫిబ్రవరి 7న సినిమా రిలీజ్ అయినప్పుడు ఢిల్లీలో వెళ్లాం. ప్రధాని మోడీ గారిని కలిశాం. అప్పుడు నా దగ్గర ఫోన్ లేదు. చైతు ఫోన్ చుద్దామంటే తను త్వరగా బయటికివెళ్ళాడు. బయటకి రాగానే కంగ్రాట్స్ డాడీ అని ఒక ఫోన్ కాల్ వచ్చింది. ఫ్యాన్స్ నుంచి వరుసగా కంగ్రాట్స్ మెసేజ్ లు వచ్చాయి. అప్పుడు అర్థమైయింది మా కన్నా మా శ్రేయోభిలాషులు ఎంత ఆనందం పడుతున్నారో అని. అందుకే అన్నాను చాలా రోజులైయింది సక్సెస్ మీట్ కి వచ్చి అని. అరవింద్ కథ విని దాన్ని లవ్ స్టోరీగా చేసి అద్భుతమైన టీం ని సెట్ చేసి సినిమాని చేయడం అంత ఈజీ కాదు. కానీ అరవింద్ చేశారు. థాంక్ యూ సో మచ్. ఇండియాలో ఫస్ట్ 100 కోట్ల క్లబ్ ప్రొడ్యూసర్ అరవింద్. గజినీ సినిమాతో ఆ రికార్డ్ అందుకున్నారు. 100 పెర్సెంట్ లవ్, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్, ఇప్పుడు తండేల్.. మూడు సూపర్ హిట్లు.. ఒకటికి మించి ఒకటి ఇచ్చిన అరవింద్ కి థాంక్ యూ. బన్నీవాసు అందరినీ కన్విన్స్ చేసి సినిమాని అద్భుతంగా మలిచి రిలీజ్ చేయడంలో ఆయన సపోర్ట్ చాలా గొప్పది. చందు అంటే నాకు చాలా ఇష్టం. చైతులో నటుడ్ని బయటికి తీసుకొచ్చాడు. ఇందులో లాస్ట్ బిట్ సోల్ అఫ్ ది ఫిల్మ్. అదే కాదు ప్రతిసన్నీవేశం అద్భుతంగా మలిచాడు. వి లవ్ యూ చందు. దేవి నా ఫేవరేట్. బుజ్జితల్లి సాంగ్ అవుట్ స్టాండింగ్ హిట్. మై రాక్ స్టార్. సాయి పల్లవి గురించి ఎంతచెప్పినా తక్కువే. ఆమెలో ఇన్నోసెన్స్ బుజ్జితల్లిలో కనిపించింది. సినిమాలో పని చేసిన అందరికీ కంగ్రాట్స్. చైతు రెండేళ్ళు ఈ క్యారెక్టర్ కోసమే డెడికెటడ్ గా వున్నాడు. ఇందులో చైతన్యని చూస్తుంటే నాన్నగుర్తుకు వచ్చారు. అక్కినేని అభిమానులకి థాంక్ యూ. 2025లో ఇది ముహూర్తం. వస్తున్నాం కొడుతున్నాం. థాంక్ యూ వెరీ మచ్'అన్నారు.

## హిలేరియస్‌గా 'బద్మాషులు' టీజర్

**- హీరో రాగ్ మయూర్**

మహేష్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్ గౌడ్ లీడ్ రోల్స్ లో శంకర్ చేగూరి దర్శకత్వంలో రూపొందున్న హిలేరియస్ ఎంటర్టైనర్ 'బద్మాషులు'. తార స్టోరీ టెల్లర్స్ బ్యానర్ పై బి.బాలకృష్ణ, సి.రామ శంకర్ ఈ




చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన ఈ సినిమా ఫస్ట్ లుక్ మంచి రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ టీజర్ ని లాంచ్ చేశారు. టీజర్ అవుట్ అండ్ అవుట్ హిలేరియస్ ఎంటర్ టైన్మెంట్ ని ప్రామిస్ చేసింది. మహేష్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్ గౌడ్ పాత్రలు విశేషంగా అలరించాయి. రూరల్ రూటెడ్ కథ, కథనం, కామెడీ చాలా ఆర్గానిక్ గా వున్నాయి. డైరెక్టర్ శంకర్ చేగూరి టేకింగ్ చాలా రిఫ్రెషింగ్ గా వుంది. టీజర్ సినిమాపై మంచి బజ్ ని క్రియేట్ చేసింది. టీజర్ లాంచ్ కు చీఫ్ గెస్ట్ గా హాజరైన హీరో రాగ్ మయూర్ మాట్లాడుతూ.. చీఫ్ గెస్ట్ గా కాదు ఒక మంచి ఫ్రెండ్ గా వచ్చాను. మహేష్ అంటే నాకు చాలా ఇష్టం. తనది వండర్ ఫుల్ జర్నీ. విద్యసాగర్ మంచి నటుడు. రూటెడ్ డ్రామాలకి మంచి డిమాండ్ వుంది. ఆడియన్స్ చాలా రిలేట్ చేసుకుంటున్నారు. సినిమా బండి, సివరపల్లిలోని వైబ్ 'బద్మాషులు' టీజర్ లో కనిపించింది. టీం అందరికీ ఆల్ ది బెస్ట్. టీజర్ చాలా ఆర్గానిక్ అండ్ ఫన్నీగా వుంది. ప్యూర్ కామెడీ వుంది. ఈ సినిమా పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను' అన్నారు.




## 'తల' బిగ్గెస్ట్ హిట్ అవుతుంది

దీపా ఆర్ట్స్ బ్యానర్ పై శ్రీనివాస్ గౌడ్ నిర్మాణంలో అమ్మ రాజశేఖర్ దర్శకత్వం వహించిన సినిమా'తల'. అమ్మ రాజశేఖర్ తనయుడు అమ్మ రాగిన్ రాజ్ ఈ చిత్రంతో హీరోగా పరిచయం అవుతున్నాడు. అంకిత నస్కర్ హీరోయిన్. రోహిత్, ఎస్తేర్ నోరన్హ,ముక్కు అవినాష్, సత్యం రాజేష్, అజయ్, విజ్జి చంద్రశేఖర్, రాజీవ్ కనకాల, ఇంద్రజ ఇతర కీలక పాత్రల్లో నటించారు. శ్యామ్ కే నాయుడు సినిమాటోగ్రఫీ అందించిన ఈ చిత్రానికి ధర్మతేజ సంగీత దర్శకుడు. ఈ నెల 14న విడుదల కాబోతోన్న తల మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా వచ్చిన.. దర్శకుడు వివిఎన్ ఆదిత్య మాట్లాడుతూ.. "పాత తరంలో తల తాకట్టుపెట్టైనా పిల్లలను ప్రయోజనకులను చేయాలంటారు. అమ్మ రాజశేఖర్ మాస్టర్ తల పెట్టి కొడుకును మంచి హీరోను చేశాడు. టైటిల్ తల అన్నప్పుడు తమిళ్ లో తల అంటే వేరే అర్థం కదా అంటే కాదు తెలుగులో తల అనే అర్థం అన్నారు. గ్లింప్స్ బావున్నాయి. రాగిన్ రాజ్ బాగా ఆకట్టుకున్నాడు. మంచి ఫ్యూచర్ ఉందని అర్థం అవుతుంది. తెలిసిన ఆర్టిస్ట్ లున్నారు. మ్యూజిక్ డైరెక్టర్ ధర్మతేజ పాటలు ఎక్స్ లైంట్ గా చేశారు. ఈ 14న విడుదల కాబోతోన్న ఈ మూవీ సూపర్ సక్సెస్ కావాలని కోరుకుంటున్నా.." అన్నారు.

నటుడు రోహిత్ మాట్లాడుతూ.." ఈ 14న సినిమా విడుదలవుతోంది. మీరంతా థియేటర్స్ కు వచ్చి సినిమా చూడాలి. ఈ మూవీలో అన్ని ఎమోషన్స్ ఉన్నాయి. ఖచ్చితంగా మీ అందరికీ నచ్చుతుంది. ఎస్తేర్ తో కాంబినేషన్ అద్భుతంగా ఉంటుంది.

### ప్రేక్షకులకు కొత్త అనుభూతి

## 'నిదురించు జహాపన'

**-హీరో ఆనంద్ వర్ధన్**

ప్రేమించుకుందాం రా, సూర్యవంశం, మనసంతా నువ్వే లాంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాలతో ప్రేక్షకులని అలరించిన పాపులర్ చైల్డ్ ఆర్టిస్ట్ ఆనంద్ వర్ధన్ హీరోగా పరిచయం అవుతున్నారు. ఆనంద్ వర్ధన్ హీరోగా ప్రసన్న కుమార్ దేవరపల్లి దర్శకత్వంలో



ఏఆర్ ఎంటర్ టైన్మెంట్స్, శ్రీజ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై సామ్, వంశీ కృష్ణ వర్మ నిర్మిస్తున్న యూనిక్ ఎంటర్ టైనర్ 'నిదురించు జహాపన'. నవమి గయాక్, రోష్ని సాహోతా హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఫిబ్రవరి 14న ఈ మూవీ గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు.

హీరో ఆనంద్ వర్ధన్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమా మాకు చాలా స్పెషల్. ఈ సినిమాలో ఎంత గొప్ప కథ వుందో చేయడానికి కూడా అంత గొప్ప కథ వుంది. ప్రాణం పెట్టి ఈ సినిమా చేశాం. ఇది చాలా ఇంట్రస్టింగ్ జర్నీ. తెలుగు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వాలని కొత్త కథ చెప్పాలనే లక్ష్యంతో చేసిన సినిమా. ఒక అద్భుతమైన కాన్సెప్ట్ మీరు చూస్తారని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను. నేను ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లో పెరిగాను. రెండు వందలమంది కలిసి సినిమా చూడటం ఒక ఎమోషన్ నాకు. సినిమా అనేది అలాంటి ఎక్స్ పీరియన్స్. చిన్న సినిమాలకు ఆడియన్స్ రావడం తగ్గించారు. మీరు ఆదరిస్తేనే మేము అడుగు ముందురకి వేస్తాం. దయచేసిన అందరూ థియేటర్స్ కి వచ్చి సినిమా చూడాలని కోరుతున్నాం. ఫెబ్రవరి 14న మా సినిమా రిలీజ్ కావడం మా టీం విజయం. వారి ప్రేమని మర్చిపోలేను. ఈ ప్రయాణంలో గొప్ప సపోర్ట్ ఇచ్చారు. అందరికీ థాంక్ యూ. ఈ సినిమా కథ మెయిన్ హైలెట్. ఒక లవ్ స్టోరీకి నిద్రకి ఏమిటి సబంధం అనేదే ఈ సినిమా.

ఈ సినిమా లో మ్యూజిక్ సోల్. అనూప్ అద్భుతమైన ఆమ్ ఇచ్చారు. నాకు ఇంత మంచి కథాబలం వున్న సినిమా ఇచ్చిన డైరెక్టర్ కి, నిర్మాతలకు థాంక్ యూ. అందరూ థియేటర్స్ లో సినిమా చూడాలని కోరుకుంటున్నాను' అన్నారు.



## విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్'

యువ సంచలనం విజయ దేవరకొండ కథానాయకుడిగా ప్రతిభగల దర్శకుడు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రంపై సినీ ప్రియులతో పాటు, సాధారణ ప్రేక్షకులలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. 'విజయ్‌దేవరకొండ12' అనే వర్కింగ్ టైటిల్ తో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి 'కింగ్‌డమ్' అనే శక్తివంతమైన టైటిల్ ను ఖరారు చేసినట్లు తాజాగా నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. టైటిల్ తో పాటు టీజర్ ను కూడా ఆవిష్కరించారు నిర్మాతలు. 'కింగ్‌డమ్' టీజర్ అద్భుతంగా ఉంది. అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలు, కట్టిపడేసే భావోద్వేగాలతో థియేటర్లలో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించే యాక్షన్ డ్రామాగా 'కింగ్‌డమ్' రూపొందుతోందని టీజర్‌తో స్పష్టం చేశారు. ఈ ఇంటెన్స్ టీజర్ తో సినిమాపై అంచనాలు రెట్టింపు అయ్యాయి. 'కింగ్‌డమ్' టీజర్ తెలుగు వెర్షన్‌కి జూనియర్ ఎన్టీఆర్, తమిళ వెర్షన్‌కి సూర్య, హిందీ వెర్షన్‌కి రణబీర్ కపూర్ వాయిస్ ఓవర్ అందించారు. ఈ ముగ్గురు స్టార్లు తమ గొంతుతో రోమాలు నిక్కబొడుచుకునేలా చేసి, టీజర్‌ను మరో స్థాయికి తీసుకువెళ్లారు. 'కింగ్‌డమ్' చిత్రానికి విజయ్ దేవరకొండ ప్రాణం పెట్టి పనిచేస్తున్నారు. సినిమాని వేరే స్థాయికి తీసుకొని వెళ్ళడానికి తన వైపు నుంచి నూటికి నూరు శాతం కృషి చేస్తున్నారు. విజయ్ తన స్టార్‌డమ్‌కి తగిన సరైన కథ వస్తే.. ఏం చేయగలరో కేలవం టీజర్ తోనే రుజువు చేశారు.

## 'లైలా' నా కెరీర్‌లో మెమరబుల్ మూవీ అవుతుంది: విశ్వక్‌సేన్

**మాస్ కా దాస్ విశ్వక్సేన్ యూనిక్ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లైలా' ఎక్సయిటింగ్ ప్రమోషనల్ కంటెంట్‌తో స్ట్రాంగ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రానికి రామ్ నారాయణ్ దర్శకత్వం వహించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించారు. ఆకాంక్ష శర్మ హీరోయిన్ గా నటిస్తోంది. పాటలు చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. లైలా ఫిబ్రవరి 14న బిగ్ స్క్రీన్స్ లో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో విశ్వక్సేన్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.**



**లేడీ గెటప్ చేయాలనే కోరిక మీకు ముందునుంచి ఉండదని విన్నాం?**

ఆర్టిస్ట్‌గా కొన్ని పాత్రలు చేయాలని ప్రతి నటుడికి ఉంటుంది. భామనే సత్యభామనే, మేడం, చిత్రం భళారే విచిత్రం, రెమో సినిమాలు చూసినప్పుడు ఆర్టిస్టుగా ఇలాంటి గెటప్ చేయాలని ఉండేది. అలాగే ఆడియన్స్ ఇప్పుడు కొత్త కథలని, థీమ్స్ ని కోరుకుంటున్నారు. ఇలాంటి సినిమాలురాక దాదాపుగా రెండు దశాబ్దాలు అవుతుంది. ఈ జనరేషన్ లో ఒక హీరో అమ్మాయి పాత్ర వేయడం గత 20 ఏళ్లుగా మనం చూడలేదు. ఆ లోటుని భర్తీ చేయాలని ఒక మంచి కథ రావడంతో ఈ సినిమా చేయడం జరిగింది.

**సోను మోడల్ లైలా ఈ రెండు క్యారెక్టర్స్ లో మీకు ఇష్టమైనది?**

డెఫినెట్ గా లైలా. కానీ సోను క్యారెక్టర్ కూడా మీరు ఫాన్స్ అయిపోతారు. ట్రైలర్లు పబ్లిసిటీలో లైలా డామినేట్ చేస్తుంది. స్క్రీన్ మీద చూస్తున్నప్పుడు మాత్రం సోను క్యారెక్టర్‌ని కూడా చాలా ఇష్టపడతారు. ఫస్ట్ హాఫ్ లో సోను మోడల్ లైఫ్ స్టైల్‌ని తన క్యారెక్టర్‌ని చాలా ఎంజాయ్ చేస్తారు.

**అసలు సోను లైలాగా మారడానికి కారణమేమిటి ?**

ఒకటి కాదు మొత్తం మూడు ప్రాబ్లమ్స్ వస్తాయి. ఆ మూడు ప్రాబ్లమ్స్ నుంచి బయటపడడానికి లైలా గా మారుతాడు. అది ఏంటనేది మీరు బిగ్ స్క్రీన్ మీద చూడాలి.

**లేడీ గెటప్ లోకి మారడానికి మీకు ఎంత సమయం పట్టింది?**

దాదాపు రెండున్నర గంటలు పట్టేది. మేకప్ ఆర్టిస్ట్ నిక్కీ ఎక్కడ కూడా కాంప్రమైజ్ కాలేదు. లేడీ గెటప్ విషయంలో ఎక్కడ కూడా కాంప్రమైజ్ అయ్యేలా ఉండదు. చాలా నేచురల్ గా వచ్చింది.

**ట్రైలర్‌లో ఎక్కువ అడల్ట్ కంటెంట్ కనిపిస్తుంది?**

అడల్ట్ కాదండి. ఇది యూత్ ఫుల్ కంటెంట్. అవుట్ అండ్ అవుట్ ఎంటర్ టైనర్.

**ఈ కథ విన్నప్పుడు మీ ఇనిషియల్ ఇంప్రెషన్ ఏంటి?**

కథ చెప్పినంత సేపు విపరీతంగా ఎంజాయ్ చేశాను. ఇలాంటి నవ్వులు జనాలకి ఎందుకు ఇవ్వకూదని అనిపించింది. ఇప్పటివరకు చేసిన సినిమాలన్నీ చాలా సీరియస్ గానే వింటాను. కానీ ఈ కథ విన్నప్పుడు మాత్రం చాలా ఎంజాయ్ చేశాను.

**మీరు కాంపౌండ్ కామెంట్ విషయంలో ఇచ్చిన సమాధానం గురించి చిరంజీవి గారు ప్రీ రిలీజ్ ఈవెంట్ లో ప్రస్తావించడం ఎలా అనిపించింది?**

నాకు చాలా ముచ్చటేసింది, నేను అక్కడితో అది ఎండ్ అయిపోయింది అనుకున్నాను. కానీ నా ఉద్దేశాన్ని చిరంజీవి గారు కూడా ప్రస్తావించడం చాలా ఆనందంగా అనిపించింది. అందరం అందర్నీ సపోర్ట్ చేసుకోవాలి. అంతిమంగా మనం మంచి సినిమాల్ని ఆడియన్స్ ఇవ్వాలి. సినిమా మీద ప్రేమతోనే అందరం ప్రయాణిస్తున్నాం.

**ఈ సినిమాకి లిరిక్స్ రాయడం ఎలా అనిపించింది?**

మొహమాటం ఏమీ లేదు. నేను రాస్తాను. బాగుంటే పెట్టుకోండి అని డైరెక్టర్ తో చెప్పాను.ఆయనకిపెట్టడం జరిగింది. నాకు రాయడం ఇష్టం.

**లైలా గెటప్‌లో మిమ్మల్ని చూసి ఇంట్లో వాళ్ళు సర్‌ప్రైజ్ అయ్యారని విన్నాం?**

వాళ్లు చాలా ఎంజాయ్ చేశారు. నవ్వులు వెక్కిరింతలు అన్నీ జరిగాయి. ఇంట్లో వాళ్ళ ఎంటర్టైన్మెంట్ వేరు. (నవ్వుతూ) మా అత్త, మమ్మీ మ్యాచింగ్ చీరలు కట్టుకొని వచ్చారు.

**మీనాక్షి క్యారెక్టర్ గురించి?**

తనది చాలా సర్‌ప్రైజింగ్ రోల్. అద్భుతంగా యాక్ట్ చేసింది. అభిమన్యు సింగ్ క్యారెక్టర్ కూడా చాలా కొత్తగా ఉంటుంది. ఆయన కెరీర్ లో ఇది చాలా డిఫరెంట్ రోల్. ఇది ఈ రెండు కాకుండా ఇంకొక సర్ప్రైజింగ్ యాక్టర్ కూడా ఇందులో ఉన్నారు. గుళ్ళు దాదా క్యారెక్టర్ కూడా ఎంజాయ్ చేస్తారు.

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**,and **Printed at SURYA DIGITAL PRINTERS,** H.No.1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI. Title-Code:- TELTEL12333,** Cell:9985389183. **Email Id:vaarthavedhikasurya.yadadri@gmail.com**